జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 6 సంచిక 334 | హైదరాబాద్, ఫిబ్రవరి 24 శుక్రవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

### బీజేపీయేతర పార్టీల బలం నిరూపించేలా..
## బీఆర్ఎస్ ప్లీనరీ

హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి: బీజేపీని వ్యతిరేకిస్తున్న ముఖ్యమంత్రులు, ప్రాంతీయ పార్టీల నేతలను ఆహ్వానించి కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీయేతర పార్టీల బలం నిరూపించే విధంగా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్లీనరీని నిర్వహించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు యోచిస్తున్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిన తరువాత రాష్ట్రంలో జరుగుతున్న తొలి ప్లీనరీ సమావేశం ఇదే.



పార్టీ ప్లీనరీకి బీజేపీయేతర జాతీయ, ప్రాంతీయ నాయకులు, అలాగే నగరంలో వారితో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. దానికి తమిళనాడు సీఎం ఎంకే.స్టాలిన్ తో పాటు.. జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్, బీహార్ సీఎం నితీశ్ కుమార్, బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, కేరళ సీఎం పినరయి విజయన్ లను ఆహ్వానించాలని సీఎం యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

### తెలంగాణకు మరో రూ.800 కోట్ల పెట్టుబడి..
## 1500 మంది యువతకు ఉద్యోగావకాశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి: హైదరాబాద్ నగరం బయోటెక్నాలజీ, ఐటీకి గొప్ప ఆకర్షణీయ గమ్య స్థానంగా ఉందని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఎంఎస్ కంపెనీ తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే టాప్ టెన్




ఫార్మాసుటికల్ కంపెనీల్లో బీఎంఎస్ ఒకటి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వారిని ఆహ్వానిస్తున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు.

'హైదరాబాద్ నగరం బయోటెక్నాలజీ, ఐటీకి గొప్ప ఆకర్షణీయ గమ్య స్థానంగా ఉంది. బీఎంఎస్ కూడా ఈ రెండు రంగాల్లో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. హైదరాబాద్ నగరంలో ఉన్న మానవ వనరుల నైపుణ్యం వారి (బీఎంఎస్) కార్యకలాపాలకు ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నా. 2028 నాటికి రాష్ట్రంలోని లైఫ్ సైన్సెస్ ఈకో సిస్టం విలువను రెట్టింపు చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా

(మిగతా 2లో..)

## 2024 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి!

హైదరాబాద్ : రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత ఎన్నికలు 2024లో జరగనున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ కొనసాగనున్నారని పార్టీ వర్గాల సమాచారం. దీన్ని బట్టి చూస్తే.. బండి సంజయ్ నేతృత్వంలోనే బీజేపీ రాష్ట్ర ఎన్నికలను ఎదుర్కొనుంది.



రాష్ట్రంలో బీజేపీని బాలోపేతం చేయడానికి జాతీయ నేతలు కూడా సన్నద్ధమౌతున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర ఇన్చార్జ్‌లుగా ముగ్గురు జాతీయ నేతలు ఉన్నారు.

కాగా, బండి సంజయ్ నేతృత్వంలో ఇప్పటికే ప్రజాగోస బీజేపీ భరోసా నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్నారు. ప్రతీ పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100కు తగ్గకుండా సభలు జరుపనున్నారు. ఈ సమావేశాలకు కేంద్ర మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరవుతున్నారు. వచ్చే ఎన్నికల కోసం రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు నేతలు రంగంలోకి దిగుతున్నారు.

### వీధి కుక్కల దాడి ఘటనపై...
## హైకోర్టు సీరియస్

హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి: హైదరాబాద్ లో వీధి కుక్కల దాడి ఘటనపై హైకోర్టు సీరియస్ అయ్యింది. మూడు రోజుల క్రితం నగరంలోని అంబర్ పేట్ లో కుక్కల దాడిలో బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే. వీధి కుక్కల దాడిలో నాలుగు ఏళ్ల బాలుడు మృత్యువాత పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. అంబర్ పేటకు చెందిన ప్రదీప్ అనే బాలుడు నడుచుకుంటూ వస్తుండగా కుక్కలు చుట్టుముట్టి తీవ్రంగా గాయపరిచి బాలున్ని పొట్టనబెట్టుకున్నాయి.

ఈ ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది. కుక్కల దాడి




కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన హైకోర్టు సీరియస్ అయింది. అతడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ కలెక్టర్, జిహెచ్ఎంసి కమిషనర్ ను ప్రతివాదులుగా చేర్చింది. జిహెచ్ఎంసి నిర్లక్ష్యం వల్లే బాలుడు మృతి చెందాడని వ్యాఖ్యానించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏం చర్యలు తీసుకుంటారని జిహెచ్ఎంసిని ప్రశ్నించింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేసింది హైకోర్టు.

## ప్రీతి ఆరోగ్యం క్రిటికల్: తమిళి సై

హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతిని గవర్నర్ తమిళి సై పరామర్శించారు. ఆమె ఆరోగ్యం క్రిటికల్?గానే ఉందని అన్నారు. వైద్యానికి సహకరించి ప్రీతి త్వరగా కోలుకుని తిరిగి రావాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ కేసులో చాలా పరిణామాలు జరిగాయని.. ఏం జరిగిందనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. స్టూడెంట్స్ అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ కేసులో విచారణ పూర్తి స్థాయిలో జరగాలని గవర్నర్ తమిళి సై



పోలీసులను కోరారు. ప్రీతీ చాలా క్లెవర్ స్టూడెంట్ అని విన్నాను... తాను ఆత్మహత్యాయత్నం చేయడం బాధాకమని చెప్పారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. మరోవైపు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సైఫ్ పోలీసుల అదుపులో ఉన్నాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ప్రీతి ఆత్మహత్యాయత్నానికి ముందు ఏం జరిగిందన్న దానిపై సైఫ్ ను విచారిస్తున్నారు.

మరోవైపు.. ప్రీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సైఫ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడిని అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

మొదటి నుంచి కూడా ప్రీతి తండ్రి సైఫ్ పైనే ఆరోపణలు చేస్తున్నారు. తమ కూతురు ఆత్మహత్యయత్నానికి సైఫే కారణమని చెబుతున్నారు.

## త్వరలో అసైన్డ్ భూములకు గ్రీన్ సిగ్నల్..!: కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి: ప్రభుత్వ భూముల్లో ఇండ్లను కట్టుకున్న నిరుపేదలకు భూముల క్రమబద్ధీకరణ చేస్తున్న తరహాను రాష్ట్ర మంతటా అసైన్డ్ భూములకూ విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు పేదలకు చెందిన అసైన్డ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు దక్కనున్నాయి.



అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్న వారికి, నోటరీ చేయించుకున్న ఇండ్లకు, స్థలాలకు క్రమబద్ధీకరణ, హక్కుల కల్పన దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది.

ఇటీవలే మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలు, సిఫార్సుల

(మిగతా 2లో..)

### కర్ణాటకలో సమ్మె సైరన్ -
## 1 నుంచి ఉద్యోగుల పోరుబాట

బెంగళూరు : కర్ణాటకలోని ప్రభుత్వ ఉద్యోగులు పోరు సైరన్ మోగించారు. పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించాలని, ఏడో వేతన కమిషన్ నివేదికను అమల్జేయాలను ప్రధాన డిమాండ్లతో ప్రభుత్వానికి ఇప్పటికే అనేక పర్యాయాలు వినువించుకున్నా ఫలితం లేకపోయిందని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానిక మరో వారం రోజుల పాటు గడువు నిర్దేశిస్తున్నామని, ఈ లోపు




సానుకూల స్పందన రాకపోతే వచ్చే మార్చి నెల ఒకటో తేదీ నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టక తప్పదని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (కెఎస్‌జిఇఎ) ప్రకటించింది. అత్యవసరంగా సమావేశమైన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వానికి ఈ గడువు ఇస్తునుట్లు కెఎస్‌జిఇఎ తెలిపింది.

ఒకవైపు ఉద్యోగులంతా వేతన పెంపు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుంటే పుండుపై కారం చల్లినట్టు బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని కెఎస్‌జిఇఎ విమర్శించింది. వేతనాల పెరుగుదలకు సంబంధించి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయకపోవడం ఉద్యోగుల ఆగ్రహానికి దారి తీసిందని పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే 7వ వేతన కమిషన్ స్కేల్‌ను అమల్లోకి తీసుకురావాలని, కనీసం 40 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగ సంఘాలు డిమండ్ చేస్తున్నాయి. అయితే బడ్జెట్ ప్రసంగంలో ముఖ్యమంత్రి ఎస్ఆర్ బొమ్మై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఉద్యోగుల్లో ఆగ్రహం పెరిగిపోయింది. తమ డిమాండ్లను నెరవేరుస్తామని సిఎం హామీ ఇస్తేనే.. సమ్మెను విరమిస్తామని ప్రకటించారు.

## మాస్టర్ కీ టీవీ ఛానల్

ప్రస్తుతము తెలుగు రాష్ట్రాలలో ఉన్న టీవీ చానల్స్ అన్నీ మూడు పొలిటికల్ పార్టీలకు, మూడు కులాలకు పరిమితమై ఉన్నాయి. వారు వారి పార్టీలకు, కులాలకు అనుకూలమైన వార్తలను మాత్రమే ప్రసారం చేస్తున్నారు.

ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరి మనోభావాలను, సమస్యలను ఛానల్ ద్వారా ప్రసారం చేసే ఉద్దేశంతో ఒక కొత్త స్కీమ్ ని ప్రవేశపెట్టాము.

టీవీ ఛానల్లో మీ వార్తలు రావాలనుకుంటున్నారా...

TS & AP రాష్ట్రాలలో ఉన్న ఉద్యోగస్తులు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు, ప్రెసిడెంట్లు, ఎం.పీ.టీసీలు, జడ్పీటీసీలు, సోషల్ లీడర్స్, NGOs కు సంబంధించిన వ్యక్తులు / సంస్థల యొక్క వార్తలు, అభిప్రాయాలు, సమస్యలు చానల్ ద్వారా 100% ప్రసారం చేయబడును.

*లైవ్ డిస్కషన్ లో పాల్గొనే అవకాశం ఇవ్వబడును.*

*ప్రసారం చేసిన తర్వాత యూట్యూబ్ లింకు కూడా ఇవ్వబోతున్నాము.*

*వార్తలు పంపటానికి ఒక ప్రత్యేక టెలిగ్రామ్ నెంబర్ ని కూడా ఇస్తాము.*

వివరాలకు సంప్రదించండి.

Contact Numbers:

1. T.Aruna Kumari — Shares Executive — 91549 58315
2. G.Vasundhara — Accounts — 91549 58314
3. G.Srinivasrao — Ap Incharge — 94415 03772
4. Sri Buran Prabhakar, TS Incharge — 93479 70131
5. S.Venkateshwarlu, Executive.TS reporters 90521 16405

## తెలంగాణకు మరో రూ.800 కోట్ల పెట్టుబడి.. 1500 మంది యువతకు ఉద్యోగావకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ రోజు బీఎంఎస్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. లైఫ్ సైన్సెస్ రంగంలో ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ యువతకు ఈ సంస్థ ఏర్పాటు ఒక గొప్ప అవకాశం' అని మంత్రి కేటీఆర్ అన్నారు.

ఎంఓయూ ద్వారా 1,500 మందిని నియమించుకుంటామన్న బీఎంఎస్ కంపెనీ త్వరలోనే తమ లక్ష్యాన్ని చేరుకొని మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్న నమ్మం తమకు ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈరోజు జరిగిన అవగాహన ఒప్పందం సందర్భంగా హైదరాబాద్ ఫార్మాసిటీలో ఉన్న అవకాశాల గురించి కంపెనీ ప్రతినిధులకు వివరించినట్లు చెప్పారు.

హైదరాబాద్ నగరం గత ఐదు సంవత్సరాల్లో అద్భుతమైన అభివృద్ధి సాధించిందని బీఎంఎస్ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఐదేండ్ల కిందట తాము హైదరాబాద్ వచ్చినప్పుడు పరిస్థితి గుర్తు చేసుకుంటే ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, మౌలిక వసతుల విషయంలో నగరం ఎంతగానో అభివృద్ధి చెందిందని వివరించారు. రానున్న మూడు సంవత్సరాల్లో తమ కంపెనీ సుమారు 1500 మంది ఉద్యోగులను నియమించుకుంటుందని.. 100 మిలియన్ డాలర్ల పెట్టుబడిని పెట్టబోతున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. తమ సంస్థ ఐటీ, టెక్నాలజీ, ఇన్నోవేషన్, వైద్య అనుబంధ రంగాల్లో కార్యకలాపాలను నిర్వహించబోతోందని వారు స్పష్టం చేశారు.

## అసైన్డ్ భూములకు గ్రీన్ సిగ్నల్ కేసీఆర్?

(మొదటి పేజీ తరువాయి)

అమలులో భాగంగా కీలక నిర్ణయాల దిశగా సిద్ధమవుతున్నది. ఇప్పటికే కలెక్టర్లకు ప్రభుత్వం అందజేసిన ఫార్మాట్‌లో వివరాల సేకరణ చురుగ్గా జరుగుతోంది. గ్రామాల వారీగా భూముల లెక్కలు, ఆక్రమణలు, ఇండ్లను నిర్మించుకున్న వివరాలు రెడీ అవుతున్నాయి. గ్రామాలలో ఆబాదీ, గ్రామకంఠం కింద ఏర్పాటు చేసిన రికార్డులను ప్రత్యేకంగా అసెస్ చేసి నివేదికలో పొందుపరుస్తున్నారు. వీటిని మార్కెట్ విలువల ఆధారంగా రేట్లు ఫిక్స్ చేసి క్రమబద్దీకరించ డంతో భారీగా రిజిస్ట్రేషన్ ఆదాయాలు వస్తాయని, తద్వారా ప్రజలకు ఇతర వెసులుబాట్లతో ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామకంఠం, ఆబాదీ భూములు 25,062 ఎకరాలున్నాయి. ప్రభుత్వ భూముల్లో సేకరించిన భూముల్లో 26 వేల ఎకరాలు, సాదాబైనామా ల కింద 5లక్షల ఎకరాలు, ప్రభుత్వ భూములు 21లక్షల ఎకరా లున్నాయి. గ్రామాల వారీగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల వివరాలు, ప్రభుత్వ సంస్థలు, భవనాలు, కార్యాలయాల వివరాలు, ఆక్రమణలు, మండలాల వారీగా ప్రభుత్వ భూములు, ఆక్రమణల్లో నిర్మించుకున్న ఇండ్లు, వారి ఆర్థిక, సామాజిక హోదా వంటి వివరాలు ప్రభుత్వానికి చేరాయి. 12 అంశాలతో నివేదికలను కలెక్టర్లు అందజేశారు..

అదేవిధంగా ఇప్పటి వరకూ పట్టా కాగితాలకే పరిమితమైన ఈ భూములకూ పట్టాదార్ పాస్ పుస్తకాలిచ్చి వారికి సమున్నత హోదా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా రాష్ట్రంలోని 22,63,139 ఎకరాల అసైన్డ్ భూములకు చెందిన 15.83లక్షల మందికి భూ యాజమాన్య హక్కుల కల్పన త్వరలో సాధ్యం కానున్నది. కులాల వారీగా కూడా భూ సేకరణ లబ్ధిదారుల వివరాలు గుర్తించారు.

వివిధ వర్గాల వారీగా 4,79,897మంది ఎస్సీలకు 5,62,789 ఎకరాలు, 3,08,48 మంది ఎస్టీలకు 6,66,037 ఎకరాలు, 6,14,325 మంది బీసీలకు 7,90,679 ఎకరాలు, 37,879 మంది మైనార్టీలకు 54,625 ఎకరాలు, లక్షా 5వేల 183మంది ఓసీలకు 1,42,733 ఎకరాలను భూమిని అసైన్డ్ చేసింది. ఇందులో 84,706 ఎకరాల భూమి ఇతరుల చేతుల్లో ఉన్నట్లుగా నిర్ధారించిన సర్కార్ వాటిపై సమగ్ర వివరాలను సేకరించింది. 1,85,101 ఎకరాలతో అసిఫాబాద్ మొదటి స్థానంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెంలో 1,66,557 ఎకరాలు, నల్గొండలో 1,38,686 ఎకరాలు, కామారెడ్డిలో 1,33,157 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని గుర్తించారు.

రంగారెడ్డి జిల్లాలోనే అత్యధికంగా అన్యాక్రాంతం

కాగా అసైన్డ్ భూముల అన్యాక్రాంతం ఎక్కువగా విలువైన భూములకు నిలయమైన రంగారెడ్డి జిల్లాలోనే జరిగినట్లుగా ప్రభుత్వానికి నివేదిక అందింది. రంగారెడ్డి పూర్వపు జిల్లా పరిధిలో దాదాపు 6,500 ఎకరాల అసైన్డ్ భూమి ప్రైవేటు పరం అయినట్లుగా అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రధానంగా సరూర్‌నగర్, మహేశ్వరం, బాలాపూర్, రాజేంద్రనగర్, శంషాబాద్ ఇబ్రాహీంపట్నం, గండిపేట, షాద్‌నగర్, చేవెళ్ల ప్రాంతాల్లో చేతులు మారినట్లుగా గుర్తించారు.

## 50 లక్షల మార్క్ చేరుకున్న కంటి వెలుగు పరీక్షలు

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. గడిచిన 25 రోజుల పని దినాల్లో కంటి వెలుగు పరీక్షలు నేటికి 50 లక్షల మార్కుకు చేరుకున్నది. రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్.. గత నెల 18వ తేదీన ఖమ్మం జిల్లాలో ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే 100 పని దినాల్లో 1.5 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించాలన్న లక్ష్యంతో 16,533 సెంటర్లలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ ఏడాది జులై 15వ తేదీ నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుంది.

# ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్

మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 23, ప్రజాపాలన : ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే శిక్షార్హులు అవుతారని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండలం రొట్టెపల్లి, హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలలో చేపట్టిన అక్రమ



నిర్మాణాలను తహశిల్దార్లతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కాసిపేట మండలం రొట్టెపల్లి గ్రామంలోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించగా స్వాధీనపర్చుకొని బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేయడం. కొరకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించడంతో పాటు 20 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించినందున అట్టి అక్రమ నిర్మాణాలను తొలగించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ భూములలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసిపేట తహశిల్దార్, హాజీపూర్ తహశిల్దార్, గుడిపేట సర్పంచ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మనదేశంలో పెరుగుతున్న ఉష్ణోగ్రత.. అటవీ సంపద అగ్నికి ఆహుతి .. ప్రధాన నగరాల్లో ప్రమాదకరంగా వాయు నాణ్యత

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23: అడవులు తగలబడుతున్నాయి.. ఈ కార్చిచ్చు ఏ అమెరికాలోనో.. ఆస్ట్రేలియాలోనో కాదు.. మన దేశంలోనే.. అటవీ సంపద అగ్నికి ఆహుతున్న ప్రాంతాలు మన తెలుగు రాష్ట్రాల్లో కూడా ఉన్నాయి. నాసా చెప్పిన మాటల్లో చెప్పాలంటే కేవలం ఏడంటే.. ఏడే రోజుల్లో మన దేశంలో ఏకంగా 11 వందలకుపైగా ప్రాంతాల్లో అడవులు తగలబడ్డాయి. వందలాది ఎకరాల్లో అటవీ సంపద తగలబడిపోవడం.. సాధారణంగా ఇటు వంటి ఘటనలు అమెరికాలోనే.. లేదా మరో ఇతర దేశాల్లోనే జరుగుతుంటాయని మాత్రమే మనం వింటూ ఉంటాం.. చూస్తూ ఉంటాం. మన దేశంలోనూ ఇటువంటి ఘటనలు సంభవించినప్పటికీ విదేశాల్లో ఉన్నంత ప్రభావం మన దేశంపై పెద్దగా ఉండదు.

కానీ ఇప్పుడు అలా కాదు.. మొన్న అనంతపురం.. నిన్న మహబూబాబాద్.. కేవలం మన తెలుగు రాష్ట్రాల్లోనే కాదు .. దక్షిణ భారతం, ఒడిషా, ఈశాన్య రాష్ట్రాల్లో కేవలం ఏడంటే ఏడే రోజుల్లో 1156 కార్చిచ్చు ఘటనలు సంభవించాయంటూ నాసా ఓ రిపోర్ట్ విడుదల చేసింది. మొత్తంగా



12 రాష్ట్రాల్లో ఈ పరిస్థితి ఉందని.. ఫలితంగా గాలిలో నాణ్యత గణనీయంగా పడిపోతోందని కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

నాసా ఫైర్ ఇన్ఫర్మేషన్ ఫర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ విజిబుల్ ఇన్ఫ్రారెడ్ ఇమేజింగ్ రేడియో మీటర్ సూట్ విడుదల చేసిన ఫోటోల్లో దేశంలో ఎక్కడెక్కడ అడవులు తగులబడుతున్నాయన్న వివరాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. అందులో ఎక్కువగా ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఒడిషా సహా ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రాంతాలు హైలెట్కట్ అయి ఉన్నాయి. ఒడిషాలో కేవలం జనవరి నెలాఖరు నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు సుమారు 10 రోజుల్లోనే 578 ఘటనలు సంభవించాయి. అడవుల్లో అగ్గి రాజుకోవడానికి మానవ తప్పిదాలతో పాటు ఫిబ్రవరి నెలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో పాటు, మోతాదుకు మించి డ్రైనెస్ పెరిగిపోవడం కూడా కారణమని నిపుణులు చెబుతున్నారు.

### సింగరేణి ఎస్ఆర్పీ -3 గనిలో గ్యాస్ లీకేజీ.. పలువురు కార్మికులకు అస్వస్థత

మంచిర్యాల : జిల్లాలోని సింగరేణి ఎస్ఆర్పీ-3 గనిలో మిథేన్ గ్యాస్ లీక్ అయ్యింది. గ్యాస్ లీకేజీని గుర్తించిన కార్మికులు బయటికి రాగా, కొందరు మాత్రం లోపలే ఉండిపోయారు. సమాచారం అందుకున్న రెస్క్యూ టీం రంగంలోకి దిగి గని లోపల 34 డిస్ట్రిక్ట్ 2వ లెవల్ 3వ డిప్ దగ్గర పడిపోయి ఉన్న ఇద్దరు కార్మికులను ప్రస్తుతం బయటికి తీసుకువచ్చారు.

## తుపాకులు, కత్తులతో పోలీస్ స్టేషన్‌పై దాడి

పంజాబ్, ఫిబ్రవరి 23: ప్రజాపాలన: వారిస్ పంజాబ్ దే గ్రూప్ చీఫ్ అమృత్‌పాల్ సింగ్ ముఖ్య అనుచరుడు లవ్‌ప్రీత్ సింగ్‌ను పోలీసులు అరెస్ట్



చేశారు. దాంతో ఆ అరెస్టుకు వ్యతిరేకంగా పంజాబ్ లోని అమృత్ సర్ లో వందలాది మంది వారిస్ గ్రూప్ నిరసనకారులు పోలీస్ లతో ఘర్షనకు దిగారు. కత్తులు, తుపాకులు పట్టుకొని పెద్ద డీజే బాక్సులతో అడ్డుగా ఉంచిన బారికేడ్లను తొలగించుకుంటూ బలప్రదర్శనను నిర్వహించారు. రాజకీయ దురుద్దేశంతోనే లవ్ ప్రీత్ సింగ్ ను పోలీసులు అరెస్టు చేశారని అమృత్‌పాల్ సింగ్ ఆరోపించాడు. గంటలో కేసు వెనక్కి తీసుకోవాలని, లేదంటే జరిగే పరిణామాలకు అధికారులదే బాధ్యత అని అమృత్‌పాల్ సింగ్ హెచ్చరించాడు. అరెస్టు విషయంలో పోలీసులు, అధికారులు ఏమి చేయలేమని చెప్పడంతోనే బల ప్రదర్శనకు దిగినట్లు చెప్పాడు.

వారిస్ పంజాబ్ దే గ్రూప్ చర్యలవల్ల అజ్నాలా పోలీస్ స్టేషన్లో భారీగా పోలీసులను మోహరించారు. బారికేడ్లు పెట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకారులను నియంత్రించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయినా, అజ్నాలా పోలీస్ స్టేషన్ బయట ఉన్న ఫెన్సింగ్‌ను దాటి వెళ్లారు. అడ్డుగా ఉంచిన బారికేడ్లను బలవంతంగా తొలగించి ముందుకు వెళ్లారు.

# అవసరమైతే మరోసారి సకలజనుల సమ్మె : కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి:సింగరేణిపై మోదీ కన్నుపడిందని, ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేస్తున్నట్లుగా కార్మికులు, సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారని కేటీఆర్ అన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఎంత వరకైనా వెళ్తామని, అవసరమైతే మరో సకలజనుల సమ్మెకు సిద్ధపడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. 'తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అస్థిత్వాన్ని కాపాడుకుంటూ ముందుకుపోతున్నాం. స్వరాష్ట్రంలో భూపాలపల్లి జిల్లాకు ఆచార్య జయశంకర్ పేరు పెట్టుకున్నాం. ఆసిఫాబాద్ జిల్లాకు కొమ్రుంభీం పేరుకుటుకున్నాం. ఆచార్య జయశంకర్ పేరు జిల్లాకే కాదు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పెట్టుకున్నాం. పీవీ నరసింహారావు పేరును మరో యూనివర్సిటీకి పెట్టుకున్నాం. కొండాలక్ష్మణ్ బాపూజీ పేరును మరో యూనివర్సిటీకి పెట్టుకున్నాం. ఇలా ఒక్కో పని చేసుకుంటూ వెళ్తున్నాం. కాళోజీ పేరిట కాళోజీ కళాక్షేత్రం వరంగల్‌లో కట్టుకుంటున్నాం.

కాళోజీ పేరిట హెల్త్ యూనివర్సిటీని పెట్టుకున్నాం. పనులు చేసుకుంటూ వెళ్లే క్రమంలో కావాలని ఓ శత్రుదేశంపై



కక్షగట్టినట్టు ప్రధాని నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ మాటలతో ఇతర వేటకుక్కల్లాంటి సంస్థలతో దాడి చేసే ప్రయత్నం చేస్తున్నాయి. 2014లో నరేంద్రమోదీ ఎన్ని మాటలు చెప్పిండో.. ఎన్ని బొంకిండో గుర్తు చేసుకోవాలి. అందరూ జన్‌ధన్ ఖాతాలు తెరిస్తే.. ధనాధన్ రూ.15లక్షలు ఇస్తానని చెప్పాడని, మరి ఎవరికైనా రూ.15లక్షలు వచ్చాయా? మరి ఇవన్నీ ఒకరి ఖాతాలోకి వెళ్లాయి? అతనేమో ప్రపంచ కుబేరుడయ్యాడు.. మనకు చేతిలో చిప్ప మిగిలింది. ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వడు. నవోదయ విశ్వవిద్యాలయం ఇవ్వడు. ఒక్క ఐఐఎం, నేషనల్ ఇనిస్టిట్యూటషన్ ఇఫ్ డిజైన్ ఇవ్వడు. చట్టప్రకారం రావాల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వడు. మిషన్ భగీరథకు పైసలు ఇవ్వమంటే.. ప్రశంసలు కురిపిస్తున్నరు కానీ డబ్బులు ఇవ్వడం లేదు. మిషన్ భగీరథకు రూ.19వేలకోట్లు, మిషన్‌కాకతీయకు రూ.5వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ చెప్పినా ఇవ్వలే' అంటూ మండిపడ్డారు.

మోదీకి నోబెల్ కోసం శాసనసభ నుంచి సిఫారు చేసి పంపుతాం..

'ఇక్కడ ఇద్దరు ముగ్గురు పిచ్చోళు తిరుగుతున్నరు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మోదీ కొవిడ్ వ్యాక్సిన్ కనిపెట్టిండని చెబుతున్నడు. ఆయనకు మెదడు మోకాళ్లలో ఉందో అరికాళ్లలో ఉందో తెల్వది. కానీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి నేను ఏ మాట చెప్పినా.. మోదీ వ్యాక్సిన్ కనిపెట్టింది నిజమే అయితే.. మోదీకి నోబెల్ బహుమతి ఇప్పించేందుకు తెలంగాణ శాసనసభ నుంచి సిఫారు చేసి పంపిస్తాం అని చెప్పాను. బండి సంజయ్ అని ఒకాయన ఉన్నడు. ఆయనకు తెలిసిందే రెండే రెండు. ఇవాళ ఏం వారం.. ఇవాళ ఏం దేవుడున్నా.. రేపు ఏం వారమన్నా.. ఏం దేవుడన్నా.. ఇవి తప్ప ఆయనకు ఏం తెలియదు.

నరేంద్ర మోదీ దేవుడని అంటున్నడు.. ఎవనికి దేవుడు? అదానీకి దేవుడా? ఎవరికి దేవుడు.. దేనికి దేవుడు? రూ.70 ఉన్న పెట్రోల్‌ను రూ.110 చేసిందుకు మా తమ్ముళందరికీ దేవుడా? రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1200 చేసినందుకు ఆడబిడ్డలకు దేవుడా? 700 మంది రైతులను ఢిల్లీలో చంపినందుకు.. రైతులకు దేవుడా? ఈ దేశంలో 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత ద్రవ్యోల్బణం, 40 ఏళ్లలో ఎన్నడూ లేని నిరుద్యోగం తెచ్చి.. రూపాయిని పాతాళానికి తీసుకెళ్లి.. అప్పుల్లో ఆకాశంలో పెట్టినందుకా దేవుడా? భారతదేశం గౌరవాన్ని ప్రపంచ దృష్టిలో తగ్గేవిధంగా దౌర్భగ్యంగా వ్యవహరిస్తున్న అసమర్ధ ప్రధానిని బలవంతంగా ఆయనను విశ్వగురు అని ఢిల్లీలో ఉన్నోళ్లు ఫేకుడు.. ఇక్కడున్నోళ్లు జోకుడు' అంటూ విమర్శలు గుప్పించారు.

మసీదులు తవ్వేందుకేనా ఎంపీని చేసింది?

'నాయకుడు, నాయకత్వమంటే మా సింగరేణి కార్మికులకు ఏం కావాలి? మా రైతులకు ఏం కావాలి. చిట్యాలలో పిల్లలకు డిగ్రీ కాలేజీ కావాలని అడిగారు. ఇలా ఆలోచన చేయాలని కానీ, తెల్లారిలేస్తే కులంపేరు మీద పంచాయితీ, మతం పేరు మీద పంచాయితీ. మతంపేరు మీద మంటలు పెట్టాలి.. కులంపేరు మీద కుంపట్లు పెట్టాలే.. తాకట్లు పెట్టాలే.. ఓట్లు వేయించుకొని అవతల పడాలి? ఇదేనా రాజకీయమా? మసీదులు తవ్వుదాం.. శవం ఇల్లితే మీది.. శివమెత్తే మాది అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అంటున్నడు. ఇందుకేనా నిన్ను ఎంపీని చేసింది? కరీంనగర్ ప్రజలు పార్లమెంట్‌కు పంపింది మసీదులు తవ్వేతందుకేనా? మసీదులు కాదు తవ్వాల్సింది.. రైతులకు నీళ్లిచ్చేందుకు కాలువలు, పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం పునాదులు తవ్వాలి.

భూపాలపల్లిలో సింగరేణి ఆధ్వర్యంలో కట్టిన వెయ్య ఇండ్లు, వేశాలపల్లిలో వెయ్యి ఇండ్లను ప్రారంభించుకున్నాం. త్వరలోనే బడ్జెట్‌లో పెట్టినట్లుగా రూ.3లక్షల చొప్పున ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించే పథకాన్ని ప్రారంభిస్తాం. భూపాలపల్లిలో ఇండ్లు లేని నిరుపేదలకు న్యాయం చేస్తాం. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా ఇస్తది.. వ్యవసాయం చేసుకునే దీమా ఇస్తుంది. సింగరేణి కార్మికులకు 18శాతం లాభాల్లో వాటా ఇస్తే.. స్వరాష్ట్రంలో కేసీఆర్ 30శాతం బోనస్ ఇస్తున్నారు. సింగరేణిపై మోదీ కన్నుపడిందని, అదానీకి అమ్మేసేందుకు కుట్ర చేస్తున్నారని, కాపాడాలని ఈ ప్రాంత

ఎమ్మెల్యేలు, కార్మిక సంఘం నేతలు కోరారు. అవసరమైతే ఎంత వరకైనా వెళ్లి సింగరేణిని ప్రైవేటు పరం కానివ్వమని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారని, అవసరమైతే దాని కోసం సకల జనుల సమ్మెకు సిద్ధపడుతాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## జయమ్మ కుటుంబాన్ని పరామర్శించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మధిర రూరల్ ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధిమధిర మండలం చిలుకూరు గ్రామ మాజీ సర్పంచ్ నిడమానూరు జయమ్మ కుమారుడు అనారోగ్యంతో ఇటీవలే అకాల మరణం పొందగా ఖమ్మం జిల్లా మాజీ



పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డివారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబాన్ని ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలోడీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి ప్రముఖ వైద్యులు డా.కోట రాంబాబు సొసైటీచైర్మన్ కటికల సీతారామిరెడ్డి అమరవాది సత్యనారాయణ రెడ్డిమి బెంజిమన్ రమేష్తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు

## కోమటిడి జ్యోతి కృష్ణ పుట్టినరోజు సందర్భంగా సేవాసదనంలో అన్న వితరణ

మధిర ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి మధిర పట్టణ వాస్తవ్యులు మృదు సభావి సేవా తత్పరుడు శ్రీ డాక్టర్ కోమటిడి శ్రీనివాసరావు సతీమణి శ్రీ లికోమటిరెడ్డి జ్యోతిలి కృష్ణ పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ వసంతమ్మ



సేవాసదనం మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో లిఅన్న వితరణ చేసినారులి ఈ సందర్భంగా లిడాక్టర్ కోమటి డి శ్రీనివాస్ రావులి మాట్లాడుతూ పుట్టినరోజు నాడు మానసిక దివ్యాంగులకు అన్నవితరణ చేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నారుఈ సందర్భంగా సేవాసదనం డైరెక్టర్ డాక్టర్ కె షీలా రాము మాట్లాడుతూ పుట్టినరోజు జరుపుకుంటున్న జ్యోతి కృష్ణ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ కోమటిడి శ్రీనివాస్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు సేవాసదనం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చీమల వెంకయ్య కుటుంబాన్ని పరామర్శించిన బి ఆర్ ఎస్ నాయకులు

మధిర ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధిమధిర మున్సిపాలిటీ పరిధిలో మడుపల్లి గ్రామంలో ఇటీవల అకస్మా త్తుగా మరణించిన చీమల



వెంకయ్య కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబ సభ్యులకు ఓదార్పు ధైర్యం చెప్పినారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్-చైర్ పర్సన్ శీలం విద్యాలత,6వ వార్డు కౌన్సిలర్ తొగరు. వరలక్ష్మి,7వ వార్డు కౌన్సిలర్ మేడికొండ. కళ్యాణి కిరణ్ మరియు తెరాస నాయకులు శీలం. వెంకట రెడ్డి, తొగరు. ఓంకార్, మేడికొండ. కిరణ్, చీమల. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

## జిల్లా టీ జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్

వికారాబాద్ బ్యూరో 23 ఫిబ్రవరి ప్రజాపాలన : జిల్లాలో ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తిచేయాలని జిల్లా టీ జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పనులు పూర్తి చేయలేని పక్షంలో తమ పదవులకు రాజీనామా చేయాలని కోరారు. తొమ్మిది ఏళ్ల తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టు పనులే ప్రారంభించని రంగారెడ్డి జిల్లాకు త్వరలో పాలమూరు నీళ్లు ఇస్తామని విడ్డూరమన్నారు. కోర్టు కేసుల వల్లే ఇన్నాళ్లు ఆలస్యం అంటూ మంత్రి కేటీఆర్ చందన్



వెల్లి కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు.

మూడేళ్లలో సుమారు లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సుమారు 32 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రారంభించిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట వనుల విషయంలో అడ్డంకులు వస్తున్నాయని చెప్పడం అవివేకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పూర్వ రంగారెడ్డి జిల్లాలో పనులు ప్రారంభించకపోవడం శోచనీయం అని అన్నారు. ఐదేళ్ల క్రితం పరిగిలో అప్పటి నీటిపారుదల శాఖ, ప్రస్తుత ఆర్థిక శాఖ హరీష్ రావు ఏడాదిలోపు పరిగికి కృష్ణా నది నీళ్లు తీసుకొచ్చి పరిగి ప్రజల కాళ్లు కడుగుతానని బీరాలు పలికారన్నారు. అప్పుడు కేసులు వేసి పనులు ఆపాడన్న వ్యక్తి ప్రస్తుత ప్రభుత్వంలో కొల్లాపూర్ ఎమ్మెల్యేగా అధికారంలో కొనసాగుతున్నాడని గుర్తు చేశారు. ఏళ్ళు గడిచినా పరిగికి కృష్ణా నది నీళ్లు రాలేదని ఘాటుగా స్పందించారు. శంకుస్థాపన చేసిన లక్నాపూర్ ప్రాజెక్టు పూడికతీత, సుందరీకరణ పనులు సంపూర్ణంగా పూర్తి కాలేదన్న విషయం ప్రభుత్వ పెద్దలు, ప్రజలు గ్రహించాలన్నారు. గత సమైక్య ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలలో నిధులు రంగారెడ్డి జిల్లావి అభివృద్ధి పనులు ఆంధ్రాకు అన్నట్లుగా ఉండేవని ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రస్తుత తెలంగాణ స్వరాష్ట్రంలో కూడా నిధులు రంగారెడ్డి జిల్లావి పనులు ఉత్తర తెలంగాణకు అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పూర్వ రంగారెడ్డి జిల్లాలో పాలమూరు రంగారెడ్డి, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుల ద్వారా సుమారుగా ఎనిమిది లక్షల ఎకరాలకు నీరిచ్చే పనులు రాబోవు రెండేళ్లలోనైనా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాప్రతినిదులు రాబోవు ఎన్నికలలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## అన్నదానం పవిత్రమైన దర్పణం

చేవెళ్ల ఫిబ్రవరి 22 (ప్రజాపాలన):- మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆవరణలో చేవెళ్ల వాస్తవ్యులు మద్దెల జంగయ్య, తలారి యాదయ్య ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తనయుడు పట్నం దినేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ప్రారంభించారు. అంతకు ముందు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని తెలిపారు. ప్రజలకు ఏ దానమిచ్చిన సంతృప్తి పరచలేమని అన్నదానం చేస్తే మాత్రం సంతృప్తిని పరచవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతను అలవర్చుకోవాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి ,గ్రామ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాసన్న గారి మాణిక్య రెడ్డి, బ్యాగరి నర్సింహులు, నాయకులు గుండెనోళ్ళ మాణిక్యం, రాంరెడ్డి, ప్రభు, శంకరయ్య తదితరులు ఉన్నారు.

# 44 కార్మిక చట్టాలను రద్దు చేసిన బిజెపి ప్రభుత్వం:

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు

బోనకల్, ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి: ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి ఆస్తులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ఆప్తుడు అదానికి కారు చౌక్ గా కట్టబెడుతున్నాడని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు ,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు ఆరోపించారు. మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో కార్మిక, కర్షక మండల స్థాయి సదస్సు సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, తెలంగాణ రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు ఏడునూతల లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల నల్ల చట్టాలను రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించి కొనసాగించాలని వారు డిమాండ్




చేశారు. ప్రపంచవ్యాప్తంగా మేడే కార్మికుల దినోత్సవాన్ని కూడా బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు పని దినాల విధానాన్ని రద్దుచేసిందన్నారు. పరిశ్రమలో 200 మంది పైగా కార్మికులు ఉంటేనే సంఘాలు పెట్టుకోవాలని లేకపోతే సంఘాలు పెట్టుకోవడానికి వీలులేదని బిజెపి ప్రభుత్వం చట్టం చేయడం దారుణం అన్నారు. 8 గంటల పని విధానాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసింది అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ లో 160 కోట్లతో ఓ పరిశ్రమ స్థాపిస్తే అందులో కేవలం 20 మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉండగా మరో 80 మంది రోజువారి కార్మికులు ఉన్నారని ఇది ఎక్కడ న్యాయమని వారు ప్రశ్నించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి 2 లక్షల కోట్లు కోత విధించాన్నారు. గతంలో పీఎం కిసాన్ పథకానికి 69 వేల కోట్లు కేటాయించగా దానిని ప్రస్తుత బడ్జెట్లో 60 వేల కోట్లకు తగ్గించారన్నారు. దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతుల ఉన్నారన్నారు. ఇందుకు 75 వేల కోట్ల అవసరం ఉండగా 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. కౌలు రైతులను ఈ ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. దేశంలో బొంబాయి, త్రివేండ్రం తో పాటు మరో నాలుగు అతిపెద్ద విమానాశ్రయాలను ఎటువంటి అనుభవం లేని అదానికి ప్రధానమంత్రి కట్టబెట్టాడన్నారని విమర్శించారు. అదానికి చెందిన విమానాలలో 26 శాతం మంది ప్రయాణికులు వెళ్లాలని బిజెపి ప్రభుత్వం నిబంధన విధించింది అన్నారు. రైతుల పండించే వాణిజ్యపరమైన పంటలకు స్థానం లేదన్నారు. దేశవ్యాప్తంగా రైల్వేలు, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని అదానీకే బిజెపి ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. అదాని వ్యవహారంపై బీబీసీ డాక్యుమెంటరీ రూపొందిస్తే దానిపై బిజెపి ప్రభుత్వం ఐటీ దాడులు చేయించిందని ఇది ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛాకు మాయనీ మచ్చ అన్నారు. బిజెపి ప్రభుత్వానికి ఎవరు వ్యతిరేకంగా పనిచేసినా వారిపై ఈడి, ఐటి, సిబిఐ లతో దాడులు చేయిస్తూ బెదిరిస్తున్నారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో 10 లక్షల మందితో నిర్వహించనున్న కార్మిక, కర్షక ప్రదర్శన ఆందోళన కార్యక్రమంలో ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ

శంకరపట్నం ఫిబ్రవరి 23 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం కేశవపట్నం ప్రాథమిక పశు వైద్యశాల పరిధిలోని తాడికల్ గ్రామంలో తెలంగాణ పశు వైద్య, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం డా. జి.భాగ్యలక్ష్మి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఎంపీటీసీ బుద్ధార్తి వరలక్ష్మి సంపత్ హాజరయ్యారు. కాగా మలంగూర్ పశు వైద్యశాల పరిధిలోని కన్నాపూర్ గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ రాజు ఆధ్వర్యంలో డా.



మాధవరావు 3764 మేకలు, గొర్లకు నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లుగా తెలిపారు. అదేవిధంగా తెలంగాణ పశు వైద్య, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 28 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఉచితంగా పంపిణీ చేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




## మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన వంగవీడు గ్రామస్తులు మరియు ఆర్కే ఫౌండేషన్ రెస్క్యూ టీం.

మధిర రూరల్ ఫిబ్రవరి 23ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో వంగవీడు గ్రామంలో మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి ఒంటిమీద బట్టలు లేకుండా గాయాలతో వంగవీడు గ్రామంలో సంచరిస్తూ ఉండగా వంగవీడు గ్రామ ప్రెసిడెంట్ పద్మ వీర రెడ్డి గ్రామస్తులు చూసి మానవతా దృక్పథంతో వస్త్రాలు అందించి భోజనం పెట్టి వైద్య చికిత్సలు అందించారు.. వెంటనే ఆర్కే ఫౌండేషన్ రెస్క్యూ టీం వారికి రూరల్ పోలీసులకు తెలియజేయగా డాక్టర్ దోర్నాల రామకృష్ణ జ్యోతి ఆర్కే సుదర్శన్ వెళ్లి వివరాలు అడగగా రైలు నుంచి జారి కింద పడిపోయానని నడుచుకుంటూ ఈ గ్రామానికి వచ్చానని సదరు వ్యక్తి తెలియజేశాడు. రూరల్ ఎస్సై నరేష్ ఆదేశానుసారం అతనిని ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమానికి తరలించడం జరిగింది.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
శుక్రవారం 24, ఫిబ్రవరి 2023


# రెండో ఏడాదిలోకి ఉక్రెయిన్ సంక్షోభం !

ఏడాది కాలంలో ఉక్రెయిన్ వివాదం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కలిగిస్తున్న నష్టం ఎంత అన్నది ఎవరూ చెప్పలేని స్థితి. ఈ ఏడాది చివరి నాటికి నష్టం 2.8 లక్షల కోట్ల డాలర్లని ఓఇసిడి దేశాల సంస్థ అంచనా. ప్రపంచ ఆర్థిక వేదిక ప్రపంచంలోని 87.4 శాతం జనాభా ఉన్న 116 దేశాలలో ఇంధన ధరల పెరుగుదల గురించి సర్వే జరిపింది. ప్రత్యక్ష, పరోక్ష కారణాలతో ఒక్కో కుటుంబంపై 63 నుంచి 113 శాతం వరకు అదనంగా భారం పడింది. అనేక దేశాల్లో చలి కాచుకొనేందుకు అవసరమైన ఇంధనాన్ని కొనుగోలు చేయలేని కారణంగా ఇంధన దారిద్ర్యంలో మునిగిన వారు, ఇతర జీవన వ్యయం పెరుగుదల వలన ప్రపంచబ్యాంకు దారిద్ర్య రేఖకు దిగువకు వెళ్లిన వారు 7.8 నుంచి 14.1 కోట్ల మంది వరకు ఉంటారు. అమెరికా అంచనా ప్రకారం నలభైవేల మంది ఉక్రెయిన్ పౌరులు, రెండు దేశాలకు చెందిన సైనికులు లక్ష మంది చొప్పున మరణించి ఉంటారు. మరి కొందరు చెప్పినదాని ప్రకారం రెండు లక్షల మంది పుతిన్ సైనికులు మరణించడమో, గాయపడడమో జరిగి వుంటుంది. వీటిని ఎవరూ నిర్ధారించలేదు. అమెరికాతో ఉన్న నూతన వ్యూహాత్మక ఆయుధ పరిమితి ఒప్పందం (స్టార్ట్) నుంచి తాత్కాలికంగా తప్పుకుంటున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మంగళవారం నాడు రష్యన్ పార్లమెంటు సమావేశంలో ప్రకటించాడు. 1991లో కుదిరిన స్టార్ట్ ఒకటవ ఒప్పందం ప్రకారం రెండు దేశాల దగ్గరా ఆరు వేల చొప్పున అణ్వాయుధాలు, పదహారు వందల ఖండాంతర క్షిపణులు, బాంబర్లకు మించి ఉండరాదు. దీని గడువు 2009లో ముగిసింది. తరువాత 2010లో కుదిరిన రెండవ ఒప్పందం ప్రకారం 2026 నాటికి రెండు దేశాలూ వాటిని ఇంకా తగ్గించాల్సి ఉంది. పుతిన్ ప్రకటన మీద అమెరికా స్పందన వెల్లడి కావాల్సి ఉంది. ఉక్రెయిన్ వివాదాన్ని పశ్చిమ దేశాలే ప్రారంభించాయని దాన్ని ముగించేందుకు రష్యా తన బలాన్ని వినియోగిస్తున్నదని పుతిన్ పార్లమెంటు సమావేశంలో చెప్పాడు. ఇప్పటికీ సంప్రదింపులకు ద్వారాలు తెరిచే ఉంచామని పరస్పర సమానత్వం, భద్రత ప్రాతిపదికన అవి ఉండాలని అన్నాడు. నాటో విస్తరణ గురించి నిజాయితీలేని సమాధానాలు చెబుతున్నారని అన్నాడు. స్థానిక వివాదాన్ని ప్రపంచ స్థాయికి తీసుకుపోయేందుకు అమెరికా చూస్తున్నదని, ఉక్రెయిన్ పౌరులు తమ పశ్చిమ దేశాల యజమానుల చేతిలో బందీలుగా మారారని పుతిన్ అన్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సామ్రాజ్యవాదులు జరిపిన అనేక యుద్ధాలు దశాబ్దాల తరబడి సాగినప్పటికీ 2022 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచాన్ని కుదిపివేసింది. ఇప్పటికీ దాని ప్రతికూల పర్యవసానాలు ప్రభావం చూపుతూనే ఉన్నాయి. రష్యా ప్రారంభించిన మిలిటరీ చర్య శుక్రవారం నాడు రెండవ ఏడాదిలో ప్రవేశించనుంది. దాన్ని మరింతగా రెచ్చగొట్టేందుకు అవసరమైన అస్త్రశస్త్రాలను అందిస్తామని ఉక్రెయిన్ రాజధానికి సోమవారం నాడు ఆకస్మికంగా వచ్చిన అమెరికా అధినేత జో బైడెన్ వాగ్దానం చేసి వెళ్లాడు. ముందుగా ప్రకటిస్తే ఎటు నుంచి ఏ ముప్పు ఉంటుందో నని భయపడిన కారణంగానే కొద్ది గంటల ముందే సమాచారాన్ని వెల్లడించి కేవలం ఐదు గంటలు మాత్రమే కీవ్‌లో గడిపి పక్కనే ఉన్న పోలండ్ వెళ్లాడు. గతవారంలో మ్యూనిచ్ నగరంలో జరిగిన భద్రతా సమావేశం తరువాత ఈ పరిణామం చోటు చేసుకుంది. పదిహేను సంవత్సరాల తరువాత అమెరికా అధ్యక్షుడు ఉక్రెయిన్ రావటం ఇదే ప్రథమం. గతంలో బిల్ క్లింటన్ 1994, 1995, 2000 సంవత్సరాలలో, తరువాత 2008లో జార్జి డబ్ల్యు బుష్ కీవ్ సందర్శనకు వచ్చారు. జూనియర్ బుష్ పెట్టిన చిచ్చు చివరకు 2014లో ఉక్రెయిన్ ఏలుబడిలో ఉన్న తన ప్రాంతమైన క్రిమియాను విలీనం చేసుకొనేందుకు రష్యాను పురికొల్పింది. రష్యా ముంగిటకు నాటో విస్తరణ అన్న సామ్రాజ్యవాదుల కుట్రను తిప్పికొట్టేందుకు రష్యా ఈ చర్య తీసుకుంది. జెలెన్‌స్కీ కోరుతున్న విమానాలు తప్ప ట్యాంకులతో సహా ఉక్రెయిన్ పౌరులను రక్షించేందుకు అన్ని రకాల ఆయుధాలను మరింతగా సరఫరా చేస్తామని, రష్యా మీద మరిన్ని ఆంక్షలను అమలు చేస్తామని జో బైడెన్ చెప్పాడు. ఒకవైపు ఇలాంటి ప్రకటనలు చేస్తున్న పశ్చిమ దేశాల నాటో కూటమి మరోవైపు శాంతికోసం పుతిన్ వైపు నుంచి ఎలాంటి సూచనలు లేవంటూ ప్రచారదాడి చేస్తున్నది. ఇప్పటి వరకు పది దఫాలుగా రష్యా మీద ఆంక్షలను తీవ్రతరం చేశారు. మరో దఫాను ప్రతిపాదించారు. నాటో కూటమి ప్రకటనలను చూస్తుంటే మరో యుద్ధ రంగాన్ని తెరిచేందుకు సిద్ధం అవుతున్నట్లు చెబుతున్నారు. మ్యూనిచ్ భద్రతా సమావేశం (ఎంఎఎస్‌సి) సందర్భంగా శనివారం నాడు నాటో ప్రధాన కార్యదర్శి జేన్స్ స్టాల్టెన్‌బర్గ్ మాట్లాడుతూ ఈ రోజు ఐరోపాలో జరుగుతున్నది రేపు ఆసియాలో జరగవచ్చు అన్నాడు. ఇప్పుడు ఉక్రెయిన్, తదుపరి తైవాన్ అన్న ప్రచారం ఎప్పటి నుంచో సాగిస్తున్నారు. రష్యాకు మరింతగా చైనా ఆయుధాలు అందచేయనున్నది అనే ప్రచారం కూడా జరుగుతున్నది. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అదే సమావేశంలో దాన్ని పునశ్చరణ గావించారు. భారత్–చైనా రెండూ ఉక్రెయిన్ వివాదంలో తటస్థంగా ఉన్నాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసినట్టే చైనా కూడా కొంటోంది. ఈ విషయంలో భారత్ పట్ల ఒక విధంగా చైనా పట్ల మరో విధంగా వ్యవహరించడం అమెరికా ద్వంద్వ ప్రమాణాలను తెలియచేస్తోంది. పైగా మన దేశం రష్యా చమురును శుద్ధి చేసి డీజిల్ ఇతర ఉత్పత్తులను అమెరికా, ఐరోపాతో సహా అనేక దేశాలకు ఎగుమతి చేస్తున్నది. నాటో కూటమి లోని జర్మనీ, ఫ్రాన్సు వంటి దేశాలు రష్యాను శత్రువుగా పరిగణిస్తున్న మాదిరి చైనా పట్ల లేవు. కానీ మొత్తం నాటోను, ఐరోపాను తమ గుప్పెట్లో ఉంచుకోవాలంటే రెండు దేశాల నుంచీ ముప్పు ఉందని, ఐరోపాను తాము తప్ప మరొకరు కాపాడలేరని నమ్మించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అందుకే రెండు దేశాలూ ఒకటే అని నూరిపోస్తున్నది. తైవాన్ సమస్యలో కూడా అందరం కలసి కట్టుగా ఉండాలని చెబుతున్నది. రష్యా గనుక ఉక్రెయిన్‌లో గెలిస్తే మొత్తం ఐరోపాకే ముప్పు అని చెబుతున్నది. తాము తమ దేశ స్వేచ్ఛ కోసమే గాక మొత్తం ఐరోపా కోసం పోరు సల్పుతున్నట్లు నిరంతరం జెలెన్‌స్కీతో చెప్పించటం కూడా దానిలో భాగమే. రష్యాను బూచిగా చూపి ఐరోపా రక్షణ బడ్జెట్లను పెంచుకోవాలని ఆ సొమ్ముతో తమ ఆయుధాలను కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నది. మరోవైపు జర్మనీ వంటి కొన్ని దేశాలు అమెరికా పట్ల అనుమానంతో చూస్తున్నాయి. రష్యా నుంచి ఐరోపా దేశాలకు ఇంధనాన్ని సరఫరా చేసే నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్ పేలుళ్ల వెనుక అమెరికా హస్తం ఉందని తెలిసిన తరువాత అవి ఉలిక్కిపడ్డాయి. ఏడాది కాలంలో ఉక్రెయిన్ వివాదం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కలిగిస్తున్న నష్టం ఎంత అన్నది ఎవరూ చెప్పలేని స్థితి. ఈ ఏడాది చివరి నాటికి నష్టం 2.8 లక్షల కోట్ల డాలర్లని ఓఇసిడి దేశాల సంస్థ అంచనా.

# కవి+సంస్కర్త = కృష్ణశాస్త్రీయం

## దేవులపల్లి కృష్ణశాస్త్రి వర్ధంతి సందర్భంగా అక్షర నివాళులు.

అతడొక కవి, భావ కవి, తెలుగు సినిమా గేయ కవి, సరళ పద సంపద కవి, ప్రకృతి అనుభూతి కవి, నాటక రచయిత, అనువాదకుడు, పాఠక, ప్రేక్షక అభిమాన కవి అంతేకాదు అతడొక సంఘజీవి, సంస్కర్త, సామాజిక అంతరాల సంఘర్షణలపై సంస్కరణోద్యమకారుడు అతడే దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి. నిజానికి కృష్ణశాస్త్రి అంటే భావ కవిగా తెలుగు సాహితీ ప్రపంచానికి పరిచయం అక్కరలేని పేరు. కానీ వారు ఉన్నత భావాలు కలిగిన గొప్ప సంస్కర్తగా కూడా గుర్తు చేసుకోవటం మన బాధ్యత. అచ్చతెనుగు భాషవట్టు, స్వచ్ఛమైన మల్లెపూ వర్ణ శోభిత పంచెకట్టు, ఆనగువోము సుందర రూపం ఆయనలోని ప్రత్యేకత. కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గర రామచంద్రపాలెంలో ఒక సత్బ్రాహ్మణ పండిత కుటుంబంలో 1897 నవంబర్ ఒకటో తేదీన జన్మించారు. భార్య రాజహంస, కొడుకు సుబ్బరాయ శాస్త్రి (బుజ్జాయి), కూతురు సీత. వీరి తండ్రి, పెదనాన్న లు గొప్ప పండితులు. అందుకే వీరింట్లో సాహిత్య గోష్టులతో ఎప్పుడూ కళకళలాడేది. వీరు పిఠాపురం లోని ఆస్థాన కవుల కుటుంబ సాహిత్య వారసత్వ ప్రభావంలో పెరిగారు, కృష్ణశాస్త్రిలో చిన్నప్పటి నుండే రచనలు చేయడం బాగా అలవడింది. పిఠాపురంలో హైస్కూల్ విద్యలో వున్నప్పుడే అక్కడి గురువులచే ఆంగ్ల సాహిత్యంపై అభిరుచి కలిగేలా చేశారు. విజయనగరంలో డిగ్రీ పూర్తి చేశాడు. పెద్దాపురం లో మిషన్ హై స్కూల్ లో ఉపాధ్యాయులు గా చేరారు. అప్పటి సమాజంలో కుల ఆధిపత్యం ప్రభావాలు ఎక్కువగా ఉండేవి. భాషా వాదం, బ్రహ్మ సమాజ ఉద్యమాలు బలంగా ఉండేవి. అప్పటికే ఉద్యోగం చేస్తున్నా, సమాజం వైపు కూడా ఆలోచన చేశాడు. అందుకే బ్రహ్మ సమాజం లో చురుకుగా పాల్గొన్నారు. అయితే చేస్తున్న అధ్యాపక వృత్తిని కూడా వద్దనుకున్నారు, పూర్తికాలం బ్రహ్మసమాజం కార్యక్రమాలలో పాల్గొన్నారు. మరోవైపు సాహిత్య రచనలు కూడా చేస్తుండేవారు. అనుకోకుండా, 1920లో కృష్ణశాస్త్రి బెజవాడ నుండీ బళ్ళారికి రైలులో ప్రయాణం చేస్తూ, చుట్టూ వున్న చెట్లు, ప్రకృతిని చూస్తూ ప్రేరణ పొందారు. అదే స్ఫూర్తి తో 1922లో 'కృష్ణపక్షం ' అనే అద్భుతమైన కావ్యం వెలువరించారు. వ్యక్తిగత జీవితం : వివాహమైన కొద్ది కాలానికే సతీమణి మరణించింది. అప్పటి నుండీ రచనల్లో విశాదం చోటుచేసుకుంది. అప్పటికి ఇంకా పాతికేళ్ల వయస్కుడే కావడం చేత, మళ్ళీ పెళ్లి చేసుకున్నారు. తిరిగి పిఠాపురం హైస్కూల్ లో అధ్యాపకునిగా చేరారు. వీరిలో ఆధునిక పాశ్చాత్య సాహిత్య ప్రభావం బాగా ఉండేది. ఆయా సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. వీరిలో వున్న ఆధునిక భావాలు, పిఠాపురం రాజాగారికి నచ్చలేదు. కృష్ణశాస్త్రి మళ్ళీ ఉద్యోగానికి రాజీనామా చేశారు. సంఘ సంస్కర్తగా : ఆంగ్ల, ఆధునిక సాహిత్య అధ్యయనం, వాటి తీరుతెన్నులతో పాటు, తన చుట్టూ ఉన్న అసమానతల భారతీయ సమాజ వివక్షతల వైపు బాగా పరిశీలన చేశాడు. ఎంతో మదనపడ్డారు. ఈ అమానవీయ వివక్షతలను చూస్తూ భరించలేక, సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం నడుం బిగించాడు. పిఠాపురం లో ఒకవైపు అంటరాని తనం, మరోవైపు కళావంతులు, వేశ్యవృత్తి విశృంఖలంగా ఉండేవి. అక్కడున్న హరిజన వసతి గృహం వారితో పరిచయం ఏర్పరచు కున్నారు. అక్కడినుండే హరిజనోద్ధరణ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ హరిజనులతో కలసి సహపంక్తి భోజనాలు చేసేవారు. అట్లాగే కళావంతులు, వేశ్యవృత్తి నిర్మూలన కోసం, వారిలో చైతన్యం తెచ్చి, వారికి పెళ్లిళ్లు



జరిపించి సమాజ స్రవంతిలో వారు కలసి పోయేందుకు ప్రయత్నం చేశారు. వారిజీవితాల్లో మార్పు తెచ్చాడు. అందుకోసం 'వేశ్యా వివాహ సంస్థ' నూ ఏర్పాటు చేశారు. ఎందరో కళావంతులకు పెళ్లిళ్లు జరిపించారు. బ్రాహ్మణీయ సమాజంలో, ఆచారాలు, కట్టుబాట్లనూ దిక్కరించి కృష్ణశాస్త్రి చేస్తున్న సంస్కరణలపై కుటుంబం, బంధువులు తీవ్రంగా వ్యతిరేకించింది, తమ కులం నుండీ వెలివేశారు. అయినా సరే తన సిద్ధాంతాలకు కట్టుబడే వున్నారు. 1933–41 మధ్యకాలంలో కాకినాడ లో మళ్ళీ అధ్యాపకులుగా ఉద్యోగంలో చేరారు. 1945లో సాహిత్య ప్రయోక్త గా ఆకాశవాణి లో చేరారు. ఇక్కడినుండి అనేక గేయాలు, నాటికలు రాసి, ప్రసంగాలు అందించేవారు.

సాహితీ వేత్తగా : కృష్ణశాస్త్రి కవితా ప్రస్థానంలో 1920 లో 'కృష్ణ పక్షం ' తెలుగు సాహిత్యంలో ఓ ప్రధాన కావ్యం గా పేర్కొనవచ్చు.

1922లో భార్యా వియోగం తర్వాత "ఊర్వశి " అనే వేదనా భరిత ఖండకావ్యం రచన చేశారు.

1929 లో శాంతి నికేతన్ సందర్శించి, ప్రముఖ బెంగాలీ రచయిత 'రబింద్రనాథ్ ఠాగూర్ ' ను కలసిన తరువాత, తన సాహిత్య రచనల్లో అనేక మార్పులు చేసుకున్నారు.

అనువాద రచనలో గోదాదేవి రాసిన తమిళ 'తిరుప్పావై' ని తెలుగులోకి అనువదించారు. ఇంకా ఇతర అనువాద రచనలు చేశారు. భారత మాతను కీర్తిస్తూ రాసిన దేశభక్తి గీతం " జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి " ప్రతి భారతీయుల మనస్సుల్లో కదలాడుతుండేది. వీరి రచనల్లో అనేక ప్రక్రియల్లో భాగంగా .. భావ కవిత్వంతో పాటు నాటికలు, భక్తి నాటికలు, కథలు, వ్యాసావళి, దేశభక్తి గీతాలు, శృంగార నాటికలు, యక్షగానాలు, సంగీతరూపకాలు, అనువాదాలు, ఇంకా 'సినిమా పాటలు' ఎన్నో రాసి సాహిత్య లోకంలో తనదొక చరిత్ర సృష్టించారు కృష్ణశాస్త్రి.

సినీ గేయ రచయితగా :

'ఆంధ్రా షెల్లీ ' గా పిలువబడే దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి 1951లో బి.ఎన్. రెడ్డి గారి ప్రోత్సాహంతో గొప్ప కళాత్మక చిత్రం శకపురుషుడు నటరత్న, ఎన్టీఆర్, భానుమతి నటించిన "మల్లీశ్వరి' వంటి తెలుగు సినిమాకు స్క్రిప్ట్, పాటల రచనతో సినిమా రంగంలో 'కలంమోపాడు" ఈ చిత్రానికి సాలూరి రాజేశ్వరరావు గారి సంగీత సారథ్యంలో, ఎలాంటి పాశ్చాత్య వాయిద్యాలను వాడకుండా, కేవలం భారతీయ వాయిద్యాలతోనే, కృష్ణశాస్త్రి గారి సుమధుర సాహిత్యానికి స్వరాలందించారు. సినీ పరిశ్రమలో ఇదొక రికార్డు. ఈ సినిమా "ఆల్ టైమ్‌ఇండియన్ క్లాసిక్ " గా నిలిచిన ఏకైక చిత్రం. తొలి చిత్రానికే పరిశ్రమ, ప్రేక్షకులు నీరాజనం పలికారు. అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించి, గొప్ప పేరు తెచ్చుకుంది. ఇలా తొలి చిత్రంతోనే సినిమా పాటల రచనలో తనదొక ప్రత్యేక ఒరవడి సృష్టించారు. ప్రకృతిలో, ఊహల్లో శృంగారం, విరహంలో, ఇంకా భక్తిలో దేశభక్తిలో ఇలా అనేక భావాలు చక్కని పదాల కూర్పుతో అందంగా పలికించారు.

సినిమా సాహిత్యం :

సినిమా పాటల రచయిత గా 1950 నుండీ 80 వ దశకం వరకూ వందలాది పాటలకు జీవం పోశారు.

1951 మల్లీశ్వరి – ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు..

1957లో భాగ్యరేఖ – నీవుండే దాకొండపై నాసామీ..

1959 రాజమకుటం – సడిసేయకో గాలి.. సడి సేయబోకే...

1967 సుఖ దుఃఖాలు – ఇది మల్లెల వేళ యనీ...

1969 ఏకవీర – ప్రతిరాత్రి వసంత రాత్రి, 1970 మాయనిమమత – రానిక నీకోసం సఖీ రాదిక వసంతమాసం

1973 భక్తతుకారాం – ఘనా ఘన సుందరా.. 1975 బలిపీఠం – కుశలమా నీకు

1975అమెరికా అమ్మాయి – పాడనా తెలుగు పాట..

1975 చీకటి వెలుగులు – చీకటి వెలుగుల కౌగిటిలో.. 1978సీతామాలక్ష్మీ – మావి చిగురు తినగానే.. 1978 శ్రీరామ పట్టాభిషేకం – ఈ గంగకెంత దిగులు

1979గోరింటాకు – గోరింటా పూచింది కొమ్మ లేకుండా... 1979కార్తీకదీపం – ఆరనీకుమా ఈ దీపం...

1983మేఘసందేశం – ఆకులో ఆకునై పువ్వులో పువ్వునై

మరికొన్ని పాటలు... ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, నాపేరు బికారీ నాదారి ఎడారి, చేసిన పాపం నీది, నేలతో నీడ అన్నది, రావమ్మా మహాలక్ష్మి రావమ్మా, చుక్కలతో చెప్పాలని ఏమని, మనిషైతే మనసుంటే, ముందు తెలిసెనా ప్రభూ.. మనసున మల్లెల మాలలు.. వంటి విభిన్న ఆరోగ్యకర గీతాలెన్నో రచన చేసి ప్రేక్షకులు, ప్రభుత్వంచే ప్రశంసలందు కున్నారు. 1978, 1982 లో ఉత్తమ గీత రచయిత గా,

1975 ఆంధ్ర విశ్వ విద్యాలయం వారిచే కళాప్రపూర్ణ, 1976లో పద్మభూషణ్ వంటి అత్యున్నత భారత పురస్కారం, 1978లో సాహిత్య అకాడమి అవార్డులు అందుకున్నారు. 1964 లో అన్నమయ్య జయంతి ఉత్సావాల్లో పాల్గొని, ప్రసంగ పాఠం చదివే ప్రయత్నంలో కృష్ణశాస్త్రి గొంతుక బొంగురు పోయింది. తనవెంట వచ్చిన రజనీకాంతరావు గారిచే తన ప్రసంగాన్ని చదివించారు. వైద్య పరీక్షలకోసం మద్రాసు వెళ్లి చూపించగా, 'గొంతు కాన్సర్ ' అని తేలింది. అప్పటినుండి 16ఏళ్ళ పాటు తన గొంతు మూగబోయింది. మాట రాక పోయినా 'పాట'వదలక, అక్షరంబాట పట్టినాడు. మౌనంగానే మాట్లాడినాడు. అలాగే ఎన్నో సినిమాలకు పాటలు, రేడియోకి లలిత గీతాలు రాసిచ్చాడు. దాదాపు 16 సంవత్సరాలు మూగ గొంతుకతోనే ఎంతో ఆత్మ విశ్వాసం తో జీవించారు . 1980 ఫిబ్రవరి 24 తన 'శ్వాస మూగపోయి' కలంఆగి, కాలంతో కలసి పోయేవరకు తన జీవితాన్ని కొనసాగించారు. దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిది ఉన్నత విలువలతో కూడిన జీవితం అటు సాంఘిక సంస్కర్తగా, ఇటు సాహితీవేత్తగా నాటికీ, నేటికీ, రేపటి తరాలకూ, ఆధునిక సమాజానికీ ఎంతో స్ఫూర్తి దాయకం. నేటికీ మారని సాంఘిక అంతరాల నిర్మూలన కోసం, అంతరించి పోతున్న మానవతా విలువల పునరుద్దరణ కోసం, కృష్ణశాస్త్రి చేసిన ఉద్యమాలు రచనలే స్ఫూర్తి గా తీసుకుని, వారి జీవిత పాఠాన్ని, సామజిక బాధ్యతగా, ప్రభుత్వం వారు విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధిస్తే విద్యార్థులలో చక్కని జాతీయ భావనలు వెల్లివిరుస్తాయి, అట్లాగే తెలుగు సాహితీలోకం కూడా వారి జీవితాన్ని, సాహిత్యాన్ని ఆచరిస్తూ, వారి అడుగు జాడల్లో నడిచి, వారి సమున్నత ఆశయాల సాధన కోసం పునరంకితమైతే, జయంతి, వర్ధంతులకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుంది. అపుడే మనం 'కృష్ణ పక్షం'గా ఉన్నట్లు! కృష్ణశాస్త్రికి వారసులం అయినట్లు!!

**దాసన్నగారి కృష్ణమూర్తి**
**అనంతపురము**

## కవయిత్రి వీలునామా !

నేను పోయినప్పుడు
ఓ కాగితాన్ని కప్పండి
రాసుకోడానికి పనికొస్తుంది
మట్టిలో కప్పెట్టకండి
మరీ గాలాడదు
పురుగూ పుట్రా ఉంటారు!
పెన్సిలు, రబ్బరు, కర్చీఫ్
బ్యాగులో ఉండేలా చూడండి
సెల్ మర్చిపొయ్యేరు
బోర్ కొట్టి చస్తాను
దండలు గిండలు వెయ్యకండి
నాకు ఎలర్జీ!
పసుపు గట్రా పూసి
భయంకరంగా మార్చకండి
పిల్లలు ఝడుసుకుంటారు
పైగా నన్ను గుర్తుపట్టాలి కదా
పుణ్యస్త్రీ, పాపపు స్త్రీ అని
పేర్లు పెట్టకండి
నాకు చిర్రెత్తుకొస్తుంది
నా సామాన్లన్నీ పడేయకండి
అడిగినవాళ్లకు ఇచ్చేయండి
మంగళవారమైనా సరే,
పాడెకు కోడిపిల్లను కట్టి హింసించకండి
ఇప్పుడైనా నా మాట నెగ్గనియ్యండి
డ్యాన్సులాడి లేట్ చెయ్యకండి
ఏదైనా టైం ప్రకారం జరగాలి
కాస్త చూసి తగలబెట్టండి
పక్కన మొక్కలుంటాయేమో!
బడికి ఇన్ఫామ్ చెయ్యండి
వాళ్లు సెలవిచ్చుకుంటారు
దేనికీ ఇబ్బంది పడకండి
కొట్లో ఖాతా ఉంది
పిట్టకు పెట్టేదున్నా లేకున్నా
అన్ని రోజులూ అందరూ ఇక్కడే ఉండండి
మళ్లీ మళ్లీ చస్తానా ఏంటి ...
పనిలో పని
కాష్టం దగ్గర
కవిసమ్మేళనం పెట్టండి
నేనూ ఉ(వి)న్నట్టుంటుంది!

**ఖైరి ఇందిర**



# వృత్తి నైపుణ్య శిక్షణ ఉత్తుత్తే..?

- శిధిలమైన వృత్తి శిక్షణ కేంద్రం భవనాలు
- ఆర్ అండ్ బి అధికారులు హెచ్చరించిన తప్పని పరిస్థితుల్లో కొనసాగుతున్న తరగతులు
- కూలిపోతున్న గోడలు, కబ్జా కు గురవుతున్న ఐటిఐ స్థలం
- హస్తవ్యస్తంగా తరగతి గదులు, విరిగిపోయి పాడైన ఫర్నిచర్
- కాపలా దారు లేక బల్బులు, కరెంట్ వైరస్లు, పనిముట్ల చోరీ.
- ఫిర్యాదు చేస్తే స్పందించని పోలీసులు, ఆస్తులు కాపాడుకోవాలని ఉచిత సలహా
- 13 కోట్ల 40 లక్షలతో పంపిన ప్రతిపాదనలు బుట్ట దాఖలు






మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 23, ప్రజాపాలన: వృత్తి శిక్షణ ద్వారా యువతకు నైపుణ్యతను మెరుగుపరిచి మేకిన్ ఇండియా.. మేడిన్ ఇండియా దిశగా దూసుకు పోవాలంటుంది మోదీ సర్కారు. భారత దేశంలో 60శాతం యువతే ఉన్నారని యువశక్తి నుంచి సద్వినియోగం చేసుకుంటే యువభారత్ గా ప్రపంచంలో దూసుకుపోవచ్చు అంటున్నారు ఆర్థిక నిపుణులు. మరి ఆదిశగా కృషి జరగుతుందా అంటే సమాధానం లేని ప్రశ్న.ఈ నేపధ్యంలో నినాదాలకే పరిమితం అవుతుంది మేకిన్ ఇండియా.. మేడిన్ ఇండియా ..

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇన్సిట్యూట్(ఐటిఐ) శిథిలావస్థకు చేరుకొంది. పురాతన కట్టడమైన ఈ భవనాలు కూలిపోతుంన్నాయి. గోడలు బీటలు వారిపోగా కిటికీలు, అద్దాలు పగిలిపోయాయి. కాపలా దారులు లేకపోవడంతో తరచూ దొంగతనాలు జరుగుతుంది. కాపర్ వైర్లు, పనిముట్లు, విద్యుత్ బల్బులు చోరీకి గురైపోతున్నాయి. ఈ విషయ మై పోలీసుల కు పిర్యాదు చేసినా లాభం లేకుండా పోతుంది. తిరిగి పోలీసులే ప్రభుత్వ ఆస్తులను మీరే కాపాడుకోవాలని ఐటిఐ లో పనిచేసే ఉద్యోగులకు ఉచిత సలహాలు ఇస్తున్నారట. పట్టణం నడిబొడ్డున విశాలమైన మైదానంలో నిర్మితమైన ఈ ఐటిఐ ఆదరణకు నోచుకోక పోతుంది. ఇదీలా ఉండగా కోట్లు విలువ చేసే ఐటిఐ స్థలం కబ్జా కు గురైపోతుంది. దీనిపై అధికారులు చూసి చూడనట్టు వ్యవహారించడంతో వందలాది మందికి వృత్తి శిక్షణ ఇచ్చే ఐటిఐ కేంద్రం సమస్యల తో కొట్టుమిట్టాడుతుంది.

## ఐటిఐ, ఐటిసి అంటే...

ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇన్సిటుట్యూట్, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్లు యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు. భారత ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కోర్సుల ద్వారా నిపుణులైన వృత్తి కార్మికులను తయారు చేసే విద్యాకేంద్రాలు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో 651 ఐటిఐలుండగా, వాటిలో ప్రభుత్వరంగంలో, 66 సాధారణ, 21 స్త్రీలకొరకు, 3 ఇతరములు, ఉన్నాయి. ప్రైవేటు రంగంలో 551 సాధారణ, 4 స్త్రీలకొరకు, 6 ఇతరములుగా ఉన్నాయి.

ఐటిఐ లు, భారత ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కోర్సుల ద్వారా నిపుణులైన వృత్తి కార్మికులను తయారు చేసే విద్యాకేంద్రాలు ఇవి. మంచిర్యాల జిల్లా లో జిన్నారం, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాలలో వృత్తి శిక్షణ కేంద్రాలు ఉన్నాయి.

## ప్రతిపాదనలు బుట్ట దాఖలు..

జిల్లాలోని వృత్తి శిక్షణ కేంద్రం లో నాలుగు వందల మంది వివిధ ట్రేడ్ లలో శిక్షణ పొందుతున్నారు. ఐతే ఈ ఐటిఐ కి సంబంధించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదకరమైన భవనంలో నైపుణ్య శిక్షణ పొందుతున్నారు.

స్టానిక ప్రిన్సిపల్ యం. చందర్ భవనాలనాన్యత పై ఆర్అండ్ బి అధికారుల కు ఆశ్రయించారు . భవనాలను పరిశీలించిన అధికారులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని, తరగతులు కొనసాగించడం ప్రమాదకరమని రిపోర్ట్ చేశారు. ఐనప్పటికీ విధిలేని పరిస్థితుల్లో తరగతులు శిథిలమైన గదుల్లో కొనసాగుతుంన్నాయి. ఇదీలాఉండగా 13కోట్ల 40లక్షలతో నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపగా అవి బుట్టదాఖలు అయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు అన్యాక్రాంతం అయిన ఐటిఐ ప్రభుత్వ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్ల పంపిణీ

## జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 23, ప్రజాపాలన :ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు పడక గదుల ఇండ్ల పథకంలో అర్హులైన లబ్దిదారులను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ తో కలిసి రెవెన్యూ, రోడ్లు-భవనాల శాఖ, మున్సిపల్ కమీషనర్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రెండు పడక గదుల ఇండ్ల పథకంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలోని



మందమర్రి మున్సిపల్ పరిధిలో 400, క్యాతన్ పల్లి మున్సిపల్ పరిధిలో 286 ఇండ్ల పనులు పూర్తి చేయడం జరిగిందని, 4 వేల 360 దరఖాస్తులు రాగా 67 పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేయాలని, సంబంధిత ప్రాంతాలలో డి.టి., ఆర్.ఐ. లతో బృందాలను ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని, దరఖాస్తుదారుల ఆధార్కార్డుతో పాటు అన్ని వివరాలను పరిశీలించాలని తెలిపారు. 2022 డిసెంబర్ 6 నుండి 13 వరకు వచ్చిన దరఖాస్తులపై వార్డుల వారిగా విచారణ జరిపి జిల్లా అధికారులు విచారణ అనంతరం తుది జాబితా మున్సిపల్ కార్యాలయం నందు ప్రదర్శించాలని, లాటరీ నిర్వహించు తేదీని నిర్ణయించి నోటీఫికేషన్ జారీ చేయాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రానికి అర్హుల జాబితా అందించాలని, 26వ తేదీన ప్రదర్శించేందుకు సిద్ధం చేయాలని, ఈ జాబితాపై 3 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించి జిల్లా స్థాయి అధికారుల సమన్వయంతో పరిశీలించాలని, మార్చి నెల మొదటి వారంలో లాటరీ ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి వేణు, రోడ్లు-భవనాల శాఖ ఈ. ఈ. రాము, మందమర్రి, క్యాతన్ పల్లి మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయాలి

## రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 23, ప్రజాపాలన :: రాష్ట్ర వ్యాప్తంగా రానున్న వార్షిక పరీక్షలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సన్నద్ధం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ ఎస్.ఎస్.సి. పరీక్షలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయ బృందాలు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, సిలబస్ ను రివిజన్ చేయించాలని తెలిపారు. ఎస్.ఎస్.సి. విద్యార్థుల కొరకు ప్రభుత్వం అందించనున్న అభ్యాస దీపికలను అందించాలని, ఫౌండేషన్ లిటరసీ న్యూమరికల్ (ఎఫ్.ఎల్.ఎన్.) కార్యక్రమం ద్వారా తరగతుల వారిగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని మౌళిక వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించడం కోసం ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన మన ఊరు - మన బడి కార్యక్రమం మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పూర్తి చేయబడిన పాఠశాలలను ఆయా నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులచే



ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ మన ఊరు - మన బడి కార్యక్రమం మొదటి విడతలో జిల్లాలో ఎంపికైన 248 పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఉత్తమ ఫలితాల సాధన దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లికి రూ. 25 కోట్ల పంచాయతీరాజ్ నిధులు మంజూరు

జయశంకర్ భూపాలపల్లి : భూపాలపల్లిలో రూ. 312 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు మంత్రి కేసీఆర్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన సభలో మంత్రి కేటీఆర్తో పాటు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని మాట్లాడారు.



కేటీఆర్ ఆదేశాల మేరకు భూపాలపల్లికి రూ.25 కోట్ల పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రకటించారు. కేసీఆర్ దయ వల్లే భూపాలపల్లి బాగుపడ్డదని తెలిపారు. ఒకప్పుడు భూపాలపల్లికి రావాలంటేనే భయపడేవాళ్లం.. ఇవాళ కేసీఆర్ నాయకత్వంలో భూపాలపల్లి అభివృద్ధి చెందుతుందన్నారు.

# బొక్కల కంపెనీ మూసివేయాలని గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి తేదీ 23ప్రజాపాలన ప్రతినిధి : బొక్కల కంపెనీని వెంటనే మూసివేయాలని 22 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలలో... అధికారులు వెంటనే స్పందించి బొక్కల కంపెనీని పర్మిషన్ రద్దు చేసి, మూసివేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల



పెద్ద ఎత్తున ప్రజలందరిని సమీకరించి ఉద్యమాన్ని ఉద్రుక్తం చేస్తామని హెచ్చరించారు.

తక్కళ్లపల్లి సర్పంచ్ కంబాలపల్లి సంతోష, కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ కావాలి జగన్, వార్డ్ మెంబర్ శ్రీనివాస్ గౌడ్, జంగయ్య, బండ అయిలయ్య,విప్లవ్ కుమార్, రమేష్, పోలె శివ, సత్యనారాయణ, వెంకటేష్,శేఖర్,చిన్న రాజు, శ్రీకాంత్,మహేష్,జంగయ్య, శివ యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు రాకుండా మేకలకు గొర్రెలకు నట్టాలమందు

లక్షటిపెట్ , ఫిబ్రవరి 23, ప్రజాపాలన: మేకలకు గొర్రెలకు సీజనల్ వ్యాధులు రాకుండా నట్టల నివారణ మందు వేయించుకోవాలని పశు వైద్యాధికారి డా శ్వేత అన్నారు గురువారం మండలంలోని తిమ్మాపూర్




గ్రామంలో మేకలకు గొర్రెలకు ఉచిత నట్టలమందు సిబ్బందితో కలిసి వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతు వేసవికాలంలో ఎండలకు వేడినీళ్లు తాగి పశువులు రోగలబారిన పడకుండా ముందస్తుగా ఈ మందు వేస్తున్నట్లు డాక్టర్ అన్నారు. పశువులు ఉన్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ముత్తె సత్తయ్య సర్పంచి చుంచు రవి , సిబ్బంది అనిల్ యాకుబ్ , గోపాలమిత్ర అభిలాస్, అజాజ్ , రైతులు పాల్గొన్నారు .

# ఈతరం ప్రజలు కళాకారులకు ప్రోత్సహించాలి

ఎర్రుపాలెం ఫిబ్రవరి 23 ప్రజా పాలన ప్రతినిధి బుధవారంనాడు ఎర్రుపాలెం మండలపరిదిలోని ఇనగాలి గ్రామంలో పొట్టపింజర సుశీలమ్మ జ్ఞాపకార్థం క్రైస్తవ పద్యనాటకాన్ని జిల్లేపల్లి పుల్లయ్య ఆర్థిక సహాయ సహకారముతో ఏర్పాటు చేయడమైనది.పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గతున్న తరుణంలో ప్రాంతీయ బేధాలు లేకుండ పుల్లయ్య ఎన్టీఆర్,జిల్లా రుద్రవరం గ్రామవాసి మన ఇనగాలి గ్రామంలో దావీదు విజయం నాటకప్రదర్శన చేయించటం చాలా అభినందనీయం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులకు ప్రాంతీయ కుల మత భేదాలు లేవనుటకు ఇది నిదర్శనమని ప్రేక్షకులు కొనియాడారు ఈ కార్యక్రమంలో.ఈనాటకం జిల్లేపల్లి రవీంద్ర బృందంచే ప్రదర్శించబడినది ప్రజా పాలన. రిపోర్టర్ వేల్పుల మోహంతు బాబు. పాల్గొన్నారు

# గంగపుత్ర మహిళ మత్స్య పారిశ్రామిక సహకర సంఘం కార్యవర్గం ఎన్నిక

జన్నారం, ఫిబ్రవరి 23, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో గంగపుత్ర మహిళ మత్స్య పారిశ్రామిక సహకర సంఘం కార్యవర్గాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. .



అధ్యక్షురాలుగా కల్లెడ స్వరూప, ఉపాధ్యక్షురాలుగా గుమ్ముల నరసమ్మ, కార్యదర్శిగా కల్లెడ సుజాత, డైరెక్టర్స్ కల్లేడ శంకరమ్మ, గుమ్ముల రాజేశ్వరి, పల్లికొండ లక్ష్మి, కల్లెడ లక్ష్మి, నాగుల నర్సమ్మ, ,దామరకుంట సుజాత లుగా ఎన్నికైయారు.మంచిర్యాల జిల్లా సీనియర్ ఇన్స్పెక్టర్ సహకార డిపార్ట్మెంట్ వి శృతి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు కల్లెడ స్వరూప కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ అలుగునురి సులోచనరవి, గ్రామ కార్యదర్శి వెంకటయ్య, గంగపుత్రా జన్నారం మండల అధ్యక్షులు కల్లెడ నర్సయ్య, గుమ్ముల లింగయ్య, నాగుల మల్లయ్య, కల్లెడ వెంకటేష మత్స్య కార్మికులు కులస్తులు పాల్గొన్నారు.

# జిపి కార్మికుల జీవితాలతో చెలగాటమా?

- పంచాయితీ కార్మికుల కృషి వల్లే పల్లె ప్రగతి
- పంచాయితీ కార్మికుల పాదయాత్ర కు కేవీపీఎస్ సంపూర్ణ సంఘీభావసభలో ప్రసంగిస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి తేదీ 23ప్రజాపాలన ప్రతినిధి: ఓ వైపు ఆకలి, మరో వైపు అవమానాలను భరిస్తూ అర్ధాకలితో నైజాం కాలం నాటి వెట్టిచాకిరి చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల జీవితాలతో పాలకులు చెల గాటమాడుతున్నారని పల్లె ప్రగతికి కఠోర శ్రమ చేస్తున్న పంచాయితీ కార్మికుల కుటుంబాలు పస్తులుంటున్నాయని వారికి కనీస వేతనం ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు .గురువారం మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చేరుకున్న పంచాయితీ కార్మికుల పాదయాత్ర కు కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా నాయకత్వం తో కలిసి ఆయన స%శీ%పూర్ణమద్దతు ప్రకటించి పాదయాత్ర తో కలిసి నడిచారు ఆరుట్ల గ్రామములో అంబేద్కర్ విగ్రహం వద్ద సభ





నిర్వహించారు తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. పంచాయతీ కార్మికుల పాదయాత్ర పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పాదయాత్ర బృందంతో చర్చలు జరుపాలన్నారు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు పల్లె ప్రగతిలో ప్రధానమైన భూమిక పోషిస్తూ పల్లెల పచ్చదనానికి ముఖ్య కారకులైన పంచాయతీ కార్మికుల జీవితాలతో పాలకులు అత్యంత దుర్భరంగా మారాయన్నారు కేంద్ర బీజేపీ సర్కార్ నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చి కేంద్ర స్వాతంత్ర్యం కంటే ముందు నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేస్తూ కార్మికుల శ్రమను దోచి అంబానీ ఆదానిలకు దాచిపెడుతుందని విమర్శించారు నాలుగు వెజ్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు నూటికి 90 శాతం మంది దళితులు గా ఉన్నందువల్ల దళిత బందులో పంచాయతీ కార్మికులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇల్లు లేని పేదలైనటువంటి పంచాయతీ కార్మికులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు మంత్రులు ఎమ్మెల్యేలు జీతాలు పెరుగుతున్నాయి కానీ పంచాయితీ కార్మికులు మాత్రం వెట్టి చాకిరి చేస్తూ అర్ధాకలితో జీవించాలా అని ప్రశ్నించారు పాదయాత్ర బృందం నాయకులు రాష్ట్ర నాయకులు చాగంటి వెంకటయ్య గణపతి రెడ్డి గ్యార పాండు పోతేపాక వినోద్ కుమార్ తునికి మహేష్ రాష్ట్ర ఉ పాధ్యక్షులు పాలడుగు సుధాకర్ రాష్ట్ర నాయకులు యాటల సోమన్న తో పాటు కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ సామేలు. ప్రకాష్ శరత్. జిల్లా నాయకులు కొండిగారి బుచ్చయ్య. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్. స్వప్న. కృష్ణ. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్. జిల్లా నాయకులు శ్యాంసుందర్. మండల ప్రజాసంఘాల నేతలు పాల్గొని మద్దతు పలికారు.

# బిఎస్పి మండల అధ్యక్ష కార్యదర్శుల నియామకం

శంకరపట్నం ఫిబ్రవరి 23 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన దేవనూరి భాస్కర్ నీ బిఎస్పి మండల అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా ఎదురుగట్ల సంపత్ ని నియమించినట్టు మానకొండూరు నియోజకవర్గం ఇంచార్జ్ భువనగిరి నాగరాజు తెలియజేశారు. బి ఎస్ పి పార్టీ బలోపేతానికి శంకరపట్నం మండలంలో ఎంతగానో కష్టపడుతున్న భాస్కర్, సంపత్ ని, గుర్తించి వీరి సేవలకు గాను పార్టీ జిల్లా అధ్యక్షుని ఆదేశాల మేరకు అతని నియమించినట్లు నాగరాజు తెలిపారు.



# పొదుపు ద్వారా ఆర్థిక లావాదేవీలు అభివృద్ధి పరుచుకోవాలి

బోనకల్ ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి:ఏపీజీవీబీ గ్రామీణ వికాస్ బ్యాంక్ కలకాట బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ప్రజల వద్దకు పెన్షన్ సౌకర్యం కోసం పొదుపు సంఘాల ద్వారా పొదుపు చేసుకొని పెన్షన్ పథకాలను అమలుపరచుకొని భవిష్యత్తు కాలంలో పొదుపు ద్వారా ఆర్థిక లావాదేవీలు అభివృద్ధి పరుచుకునేందుకు సంఘటితంగా పొదుపులు చేసుకొని బ్యాంకు వడ్డీ ద్వారా రైతులు సమ్యాన్నులు పొదుపు సంఘాల వారు అభివృద్ధి కావాలని గ్రామీణ వికాస్ బ్యాంక్ కలకోట మేనేజర్ ప్రదీప్ కుమార్




అన్నారు. అళ్లపాడు గ్రామంలో సర్పంచ్ మర్రి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన బ్యాంకు పొదుపు సంస్థలను బ్యాంకుల ద్వారా అభివృద్ధి చేసుకోవాలని గ్రామ ప్రజలతో గ్రామీణ బ్యాంక్ ఖాతాదారుల తో మిమిక్రీ ద్వారా ప్రజలకు అర్థమయ్యే విధంగా పొదుపుని ఎలా చేసుకోవాలో ప్రజలకు అర్థమయ్యేలా మిమిక్రీ ద్వారా మిమిక్రీ చేసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కలకోట బ్రాంచ్ వారికి సర్పంచ్ తిరుపతిరావు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వికాస్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చిరంజీవి, బ్యాంకు మిత్ర ఖాతాదారులు పొదుపు లబ్ధిదారుల పాల్గొన్నారు.

# కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి ముఖ్య రాజగోపాల్

జన్నారం ఫిబ్రవరి 23, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మ్నెర్రిగూడ గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్య రాజగోపాల్ అన్నారు. గురువారం



మండలంలోని మర్రిగూడ గ్రామపంచాయతీ ఆవరణలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం నుండి పేద ప్రజలకు సంబంధించిన అందత్వం నుండి నివారణకు కొరకు నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ప్రజల కోసం ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు.. ప్రభుత్వం నుండి కంటి వెలుగు కార్యక్రమంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఉచితంగా కళ్ళ అద్దాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జునుగూరి దుర్గ మాధురి, కంటి వెలుగు మెడికల్ సిబ్బంది, గ్రామ అధికారులు సిబ్బంది, గ్రామస్తులు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య కార్డ్ కొరకు ధరఖాస్తులు స్వీకరణ

మేడిపల్లి, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి) ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన పథకాన్ని ప్రవేశపెట్టారు.

ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య కార్డ్ కొరకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియను హబ్సిగూడ డివిజన్ గాంధీ గిరిజన బస్తీలో స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ ప్రారంభించగా రామంతాపూర్ డివిజన్ కామాక్షి పురంలో స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కన్నావత్ రాజు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9000178307 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| ఎన్.బండయ్య | - | చేవెళ్ల | - | 9959032940 |
| నరేందర్ | - | చేవెళ్ల | - | 9490148304 |
| ఎం.పరమేష్ | - | శంకరపల్లి | - | 7989723793 |
| జి.అర్జున్ | - | శంకరపట్నం | - | 7386777544 |
| ఎం.యాదయ్య | - | చేవేళ్ల నియోజకవర్గం | - | 8328236516 |
| ఎం.మురళీ | - | షాబాద్ | - | 9989770468 |
| తల్లాడ బాబురావు | - | వైరా | - | 9848236015 |
| ఈశ్వర్ రవితేజ పసుపులేటి | - | రూరల్ మధిర | - | 6305269141 |
| భుక్య శ్రీనివాస్ | - | బోనకల్ | - | 8688810293 |


# గృహ సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన సదస్సు

శంకరపట్నం ప్రజాపాలన ఫిబ్రవరి 23: స్త్రీ నిధి మరియు తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టిఎస్ఆర్ఈడిసి) సంస్థ సంయుక్తంగా అమలు చేస్తున్న గృహ సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు కార్యక్రమంపై మండలంలోని కేశవపట్నం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న సందర్భంగా గ్రామపంచాయతీలో గురువారం మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు బాబు, దీప అవగాహన కల్పించారు. నేటి కాలంలో విద్యుత్ అవసరాలు,ఖర్చుల భారం దృష్ట్యా తమ ఇంటిలో సౌర విద్యుత్తు యూనిట్ ఏర్పరచుకొని, సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకొని, గణనీయంగా ఖర్చులు తగ్గించుకొని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడ



వచ్చునని అర్థవంతంగా వివరించారు. ఈ సౌర విద్యుత్ 2 కిలో వాట్స్ ర

సౌర విద్యుత్ యూనిట్ కి.రూ.1,42,200ల కి అందించబడునని, దీనిలో రూ. 39,200 లు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని, స్వయం సహాయక గ్రూపు సభ్యుల వద్ద పెట్టుబడి లేకపోయినట్లయితే స్త్రీ నిధి నుండి ఋణం అందజేస్తారని, దీనికిగాను నెలనెలా రూ.2243ల చొప్పున 60 నెలల కాలంలో రుణం మొత్తం తీరిపోతుందని తెలిపారు. ఈ సౌర విద్యుత్ యూనిట్ ద్వారా ప్రతిరోజు 8 యూనిట్ల నుండి 12 యూనిట్ల వరకు ఉత్పత్తి జరుగుతుందని, తమ గృహ అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్తును అవసరం కలిగినప్పుడు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అవగాహన కల్పించారు. మరిన్ని వివరాల కోసం తమ మండలంలోని ఐకెపి కార్యాలయంలో సంప్రదించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం మండల ఏపీఎం సుధాకర్, సీసీ ముంజ సంపత్, గ్రామంలోని మహిళా సంఘాల అధ్యక్షులు, విఒఏ లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ నిర్మాణం కోసం 30 లక్షల విలువైన 700 గజాల స్థలం బహుకరించిన పెద్ది శ్రీనివాస్ గుప్తా

ప్రజా పాలన కొందుర్గు ::కొందుర్గ్ గ్రామానికి చెందిన పెద్ది శ్రీనివాస్ గుప్త %మీూా% కోరిక మేరకు గ్రామంలో గ్రంథాలయం నిర్మాణం కోసం, వారి తాత నాయనమ్మలైన పెద్ది రామచంద్రయ్య లక్ష్మీ నర్సమ్మ ల జ్ఞాపకార్థం,30 లక్షల విలువైన 700 గజాల స్థలాన్ని తెలంగాణ గ్రంథాలయ సంస్థ కు రిజిస్ట్రేషన్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ మనోజ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకట రమణా రెడ్డి ఈ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో



పాల్గొన్నారులి. లిఈ సందర్భంగా పెద్ది శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ మా తాతయ్య నాయనమ్మల జ్ఞాపకార్థం గ్రంథాలయ నిర్మాణం కోసం స్థలం బహుకరించడం నాకెంతో సంతోషంగా ఉ ందన్నారు ఈ గ్రంథాలయం సద్వినియోగం చేసుకొని ఉన్నత పదవులతో పాటుగా మంచి నడవడిక క్రమశిక్షణ అలవర్చుకొని భవిష్యత్తును ఇతరులకు మార్గదర్శకంగా మార్చుకోవాలని అన్నారు మనిషికి చదువు అనేది ఒక ఆయుధం లాంటిది ఎంత విద్యను అభ్యసిస్తే అంత మేధో శక్తి లభ్యమవుతుందని అన్నారులి

లిఈ కార్యక్రమంలో కొందుర్గ్ గ్రామస్తులు, కొందుర్గ్, జిల్లేడు చౌదర్ గూడ మండలాలకు చెందిన నాయకులు మురళి యాదవ్ గారి ఆధ్వర్యంలో సన్మానించి,ధన్యవాదాలు తెలిపారు

# సిపిఎం అద్వర్యంలో తహశీల్దార్ కి వినతి పత్రం సమర్పణ

శంకరపట్నం ఫిబ్రవరి 23 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఐఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.




ఈ సందర్భంగా సి పి ఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ.. వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై మోయలేని ఆర్థిక భారాలు మోపిందని, పేదరికం నిరుద్యోగం పెరిగి పోతావుందని, కేంద్ర ప్రభుత్వ విధానాల మూలంగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆయా తరగతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఉద్యోగాల కల్పన జరిగే రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని, ఐదు కేజీల ఉచిత బియ్యం తో పాటు 5 కేజీల సబ్సిడీ బియ్యం స్కీంను పునరుద్ధరించాలని, ధనికులపై సంపద, వారసత్వ పన్ను విధించాలని, వారికి పన్ను రాయితీలు ఉపసంహరించాలన్నారు.

ఆహారం, మందులపై జిఎస్టి రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని, దేశవ్యాప్తంగా ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయాలని, కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్లో అన్ని రకాల పంటలకు మద్దతు ధరల చట్టం చేసి ప్రకటించాలన్నారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి మనిషికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలీ రూ. 600 ఇవ్వాలని, పట్టణ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టాలని అయన అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే 333 జీవోను రద్దు చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్ను సవరించి, ఈ డిమాండ్లు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరామ్ మ్రో కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్ల రాజు, యుగేందర్, ఆకుల తిరుపతి, అర్.వెంకటేష్, సయ్యద్ ఇస్మాయిల్, మేకల రవి, కల్లూరి శ్రీనివాస్, గోదరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినులకు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

మేడిపల్లి, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి): రామంతాపూర్లోని మేఘా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు దివ్య, మానస, స్పందన, పల్లవిలకు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు.

బీకాం చదువుతున్న విద్యార్థుల ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని ఆర్థిక సహాయం చేశారు.



ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

అందులో భాగంగానే పేద విద్యార్థినులకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్ గౌడ్, చిన్నారావు, నరేష్ జాంగిర్, సూరం శంకర్, చాంద్ పాషా, ప్రశాంత్ గౌడ్, బోసని పవన్ కుమార్, అరవింద్, ఆకాష్, నరేందర్,

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ సుభాష్ నాయక్ సొంత నిధులతో డివిజన్లో నూతన కమాన్లు నిర్మాణం

మేడిపల్లి, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి) పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్లోని కాకతీయ నగర్,సౌత్ పంచవటి కాలనీల నూతన కమాన్ల నిర్మాణానికి పంచవటి కాలనీ కమాన్ పున:నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ సుభాష్ నాయక్ ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జక్క వెంకట్ రెడ్డి పాల్గొని కమాన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ పీర్జాదిగూడ కార్పొరేషన్ 2వ డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతున్న తరుణంలో ప్రతి కాలనీకి ఒక గుర్తింపుగా కమాన్ ఉండాలని సంకల్పంతో కాకతీయ నగర్ కాలనీ,సౌత్ పంచవటి కాలనీలకు నూతన కమాన్లను అలాగే పంచవటి కాలనీ కమాన్ పునర్నిర్మాణాన్ని సొంత నిధులతో నిర్మిస్తున్నానని, భవిష్యత్ తరాలకు గుర్తుండిపోయే విధంగా కమాన్లను నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి, కాకతీయ కాలనీ అధ్యక్షుడు బాలరాజు,జనరల్ సెక్రెటరీ జంగయ్య,సౌత్ పంచవటి కాలనీ అధ్యక్షుడు నరసింహారావు,జనరల్ సెక్రెటరీ సుబ్బారావు, పంచవటి కాలనీ జనరల్ సెక్రెటరీ ముక్తేశ్వర్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు బలరాం,మనోరంజన్ రెడ్డి, జయేందర్,జావిద్ ఖాన్,డాక్టర్ శ్రీనివాస్, మల్ల వెంకటేష్,ధరణి కాలనీ అధ్యక్షుడు పురుషోత్తం,ఎస్ వి కాలనీ అధ్యక్షుడు రాధాకృష్ణరావ్, పలుకాలనీలవాసులు గంగులు, శంకర్ చారి,దయాకర్ రెడ్డి, నాగిరెడ్డి,సురేందర్ రెడ్డి,శ్రీనివాస్,శ్రీశైలం, కోటేశ్వరరావు,వెంకటేశ్వర్లు,వర్కల శ్రీనివాస్,బండారి మల్లేష్,వంగాల మల్లేష్, మహిళా నాయకులు విమలభాయ్,లక్ష్మీ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.




# పనిచేయని సర్పంచులపై చర్యలు తప్పవు

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు
- వైకుంఠధామాలు పార్కుల్లా ఉండాలి
- చదువే ఏకైక ఆయుధం
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్ బ్యూరో 23 ఫిబ్రవరి ప్రజాపాలన : గ్రామాభివృద్ధిలో వెనుకబడిన సర్పంచులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టర్ ట్రైని కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి దోమ మండలంలోని లోని ప్రకృతి వనం , డంపింగ్ యార్డ్ , వైకుంఠధామం, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రంతో పాటు తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపడుతుందని దీనికి గ్రామాల్లోని సర్పంచులు , అధికారులు సమిష్టిగా కలిసి అభివృద్ధి పనులు చేపట్టాలని



కలెక్టర్ సూచించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డ్ నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై కూడా చర్యలు తప్పవని ఆయన అన్నారు. నర్సరీలు ఎప్పుడూ మొక్కలతో పచ్చగా ఉండేలా చూడాలని తెలిపారు. వైకుంఠ ధామాలు వినియోగంలో ఉంటూ పార్కుల్లాగా ఉండేలా చొరవ తీసుకోవాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ పనులు చేసేందుకు వీలున్నప్పటికీ నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసం అని కలెక్టర్ అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, త్రాగునీరు సౌకర్యంపై ఎప్పటికప్పుడు అధికారులు ఆరాతీస్తూ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా ఎలాంటి పిచ్చి మొక్కలు ఉండకుండా ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని సూచించారు. ప్రకృతి వనాలకు వాచర్లను (వన సంరక్షకులను) నియమించుకొని వారితో పని చేయించలేకపోతున్నారని కలెక్టర్ అన్నారు.

లి దోర్నాల్ పల్లి పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెండ్ :

ప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన దోర్నాల్ పల్లి పంచాయతీ కార్యదర్శి , టెక్నికల్ అసిస్టెంట్ కలెక్టర్ సస్పెండ్ చేశారు. పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా ఉన్న ఎంపీఓ కు మెమో జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో చదువే ఏకైక ఆయుధమని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో భాగంగా దోర్నాల్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థిని విద్యార్థులతో వారు అభ్యసిస్తున్న పాఠాలను అడిగి తెలుసుకోవడంతోపాటు పిల్లల సామర్థ్యాన్ని బోర్డుపై రాయించి తెలుసుకున్నారు. చదువే మీకు ఏకైక ఆయుధమని, బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని కలెక్టర్ తెలిపారు. ధాత్రి అనే విద్యార్థిని పేరు అడిగి అర్థం చెప్పమనగా వెంటనే ఆ విద్యార్థిని ధాత్రి అంటే భూమి అని సమాధానం చెప్పింది. దీనికి కలెక్టర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్వాడి, ఆశ వర్కర్ విధివిధానాలపై సూచనలు ఇచ్చారు. పాఠశాలకు సరఫరా అయిన బియ్యమును అదేవిధంగా వంటగదిని పరిశీలించారు. అధికారుల సమావేశానికి ముందుగా ఎంపీడీవో తాసిల్దార్ కార్యాలయాలను, రికార్డు గదిని కలెక్టర్ పరిశీలించారు.

# మాటూర్ హైస్కూల్ విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం

మధిర రూరల్ ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధిమధిర మండలంలోని మాటూరు హైస్కూల్ విద్యార్థులకు ఐసిడిఎస్ మరియు పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం గ్రామ సర్పంచ్ మేడిశెట్టి లీలావతి, రూరల్ యస్ ఐ నరేష్



ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దీవి సాయి కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిడిపిఓ శారదా శాంతి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం నేరం, అవి జరగకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిదీ అని తెలియజేసారు. మీ గ్రామంలో అలాంటి వివాహాలు జరిగే సందర్భంగా పోలీస్ శాఖ వారికి 1098 ఫోన్ చేసి తెలిపినట్లయితే వెంటనే చర్య తీసుకొని బాల్యవివాహాలు జరగకుండా నిరోదిస్తామని తెలిపారు రూరల్ యస్ ఐ నరేష్ మాట్లాడుతూ మైనర్ విద్యార్థులెవరు ద్విచక్ర వాహన నడుపకూడదని, ఆడపిల్లలను వేదించకూడదని తెలియజేస్తూ అందరూ చదువు పై దృష్టి ఉంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి అని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అడపాల వెంకటేశ్వర్లు,ఐసిడిఎస్ సూపర్ వైసర్ అన్నపూర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# కేవీ ప్రతాప్ పై దాడి అమానుషం

## - మంచిర్యాల జిల్లా పట్టణ వైశ్య సంఘాల నాయకులు.

మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 23, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో లో కె.వి.ప్రతాప్ కొందరు దుండగులు చేసిన దాడి నుంచి ఆర్య వైశ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సమాజానికి చెందినటువంటి వ్యక్తి, రాజకీయంగా ఎదుగుదలను ఓర్వలేక అతనిపై ఇతర గుర్తుతెలియని రాజకీయ నాయకులు దాడి చేయడం సరైన పద్ధతి కాదు అని హెచ్చరించారు. ఏమైనా రాజకీయ కక్షలు ఉంటే పోటాపోటీ రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ దాడి చేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఇందుకుగాను రాజకీయంగా ఎదుగుతున్న ఆర్యవైశ్య సమాజానికి సంబంధించిన కేవీ ప్రతాప్ పై దాడిని మంచిర్యాల జిల్లా పట్టణ ఆర్యవైశ్య సంఘాల తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు . ఇలాంటి దాడిలు వైశ్యులపై జరిగితే తమ సత్తా ఏందో రాబోవు ఎన్నికలలో చూపిస్తామని హెచ్చరించారు. ఇలాంటి దాడులు పునరావృతం అవుతే గనుక జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆందోళనలు చేపడుతాం అని హెచ్చరించారు. ఈ దాడిని ఖండించిన వారిలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు ముక్తా శ్రీనివాస్ , మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రేణిగుంట్ల శ్రీనివాస్, మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దొంతుల ముఖేష్, వాసవి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కంభంపాటి కమలాకర్ , ఆర్యవైశ్య మహాసభ జిల్లా పిఆర్ఓ కేశెట్టి వంశీకృష్ణ, వైశ్య సంఘం నాయకులు చిలువేరు వైకుంఠం, కొత్త రాజేశం, కొత్త జయప్రకాష్, ముత్యాల శ్రీనివాస్, ఎర్రం వెంకటేష్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కుక్కల స్వైర విహారం, పట్టించుకోని అధికారులు

## రోడ్లపై, వీధుల్లో తిరగాలన్న భయపడుతున్న గ్రామ ప్రజలు

బోనకల్ ఫిబ్రవరి 23 ప్రజా పాలన ప్రతినిధి: మండల కేంద్రంలో వీధుల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బయటకొచ్చిన చిన్నారులను భయాందోళనకు గురి చేస్తూ ఆటలాడుకునే చిన్నపిల్లలపై దాడికి పాల్పడుతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వీధుల్లో, రోడ్లపై



తిరగాలన్న వెంబడించి ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. ఎన్నిసార్లు మండల అధికారులకు తెలియపరిచిన మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదనీ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కుక్కల బెడద తీవ్రంగా ఉండడంతో పలువురు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో పెద్దలు ,చిన్న పిల్లలపై దాడికి పాల్పడుతున్నాయి. దీంతో పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు భయపడుతూ ఆందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కలను పట్టుకోవాల్సిన అధికారులు మాకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో తదితర ప్రాంతాలలో కుక్కల బెడద గుంపులు గుంపులుగా తిరుగుతూ స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రిపూట బయట తిరగాలన్న శునకాలు వెంబడించి కుక్క కాటుకు బలి చేస్తున్నాయి. ఎదురుపడే వారిపై దాడిచేస్తున్నాయి. కుక్కల అరుపులతో వీధుల్లో నడవడానికి పలువురు భయాందోళన చెందుతున్నారు. ఏ క్షణాన ఏ కుక్క వచ్చి మీదపడుతుందోనన్న బెంగ స్థానికులను కుంగదీస్తోంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కుక్కల బెడద లేకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# న్యూయార్క్ గుడిలో మాల తీసిన చరణ్..!



మెగా పవర్ స్టార్ రాం చరణ్ తను ఎంత బిజీగా ఉన్నా సరే ఆధ్యాత్మిక విషయాల్లో ఎప్పుడూ ముందుంటారు. టాలీవుడ్ స్టార్ హీరోల్లో ఎక్కువసార్లు అయ్యప్ప మాలలో కనిపించిన హీరో ఎవరంటే అది చరణ్ మాత్రమే అని చెప్పొచ్చు. రీసెంట్ గా మాల ధరించినట్టు కనిపించిన చరణ్ ఆస్కార్ అవార్డుల కార్యక్రమానికి యూఎస్ వెళ్లాడు. వెళ్లేప్పుడు.. యూఎస్ లో కూడా మాల తో కనిపించాడు చరణ్. అయితే సడెన్ గా నిన్న ఈవెనింగ్ మళ్లీ సివిల్ డ్రెస్ లో సూటు బూటు వేసుకొని కనిపించాడు. ఇక్కడ నుంచి మాలతో వెళ్లి అక్కడ ఎలా చరణ్ అలా మారిపోయారని అందరు అనుకున్నారు. చరణ్ న్యూయార్క్ గుడిలో తన మాల తీసినట్టు సమాచారం. 21 రోజులు పూర్తి కావడంతో అక్కడ గుడిలో మాల తీసి ప్రత్యేక పూజలు నిర్వహించారట చరణ్. అయితే ఆ విజువల్స్ మాత్రం బయటకు రాలేదు. మొత్తానికి తను ఎంత పెద్ద స్టార్ అయినా కూడా చరణ్ తన భక్తి భావనని కొనసాగిస్తున్నారు. చరణ్ రెగ్యులర్ గా అయ్యప్ప మాలలో కనిపిస్తూ ఉంటారు. అయితే టైం ని బట్టి 21 40 రోజులు అలా మాల ఉంచుకుంటారు. ఆస్కార్ అవార్డుల వేడుకలకు ఇండియా నుంచి మాలతో వెళ్లినా న్యూయార్క్ టెంపుల్ లో మాల తీసి సివిల్ డ్రెస్ లో దర్శనమిచ్చాడు చరణ్. ఆర్.ఆర్.ఆర్ సినిమాలో సీతారామరాజు పాత్రలో నటించిన చరణ్ ఆ పాత్రకి పూర్తిస్థాయిలో న్యాయం చేశాడు. ఎన్.టి.ఆర్ కు ఏమాత్రం తీసిపోని విధంగా తన నటనతో సత్తా చాటాడు చరణ్. ఓ పక్క కొమరం భీమ్ గా తారక్ రామరాజుగా చరణ్ వారి నట విశ్వరూపం చూపించారు. అందుకే ఆర్.ఆర్.ఆర్ ఇంటర్నేషనల్ లెవల్ లో ప్రేక్షకులను మెప్పించింది. ఆర్.ఆర్.ఆర్ ఇప్పటికే ఎన్నో అవార్డులను సాధించింది. ఇక అకాడమీ అవార్డ్ కూడా వస్తే సినిమా తెలుగు సినిమా చరిత్రలో మిగిలిపోతుంది. ఆస్కార్ నామినేషన్స్ లో ఆర్.ఆర్.ఆర్ నుంచి నాటు నాటు సాంగ్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నామినేట్ అయింది. అయితే ఈ ఈవెంట్ కు అటెండ్ అయ్యేందుకు చరణ్ మాత్రమే యూఎస్ వెళ్లారు.

# బాబాయ్ వర్సెస్ అబ్బాయ్ ఆట మొదలయ్యేది అప్పుడే!



దగ్గుబాటి హీరోలు విక్టరీ వెంకటేష్ రానా తొలిసారి కలిసి నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. యాక్షన్ క్రైమ్ డ్రామాగా రూపొందించిన ఈ సిరీస్ ని కరణ్ అన్షుమన్ రీ క్రియేట్ చేశాడు. అమెరికన్ టీవీ సిరీస్ 'రే డొనోవన్' ఆధారంగా ఈ సిరీస్ ని రీమేక్ చేశారు. హిందీలో ప్రధానంగా నిర్మించిన ఈ సిరీస్ ని తెలుగులోనూ రిలీజ్ చేస్తున్నారు. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. రానా వెంకటేష్ తొలిసారి తండ్రీ కొడుకులుగా నటించారు. రానా వెంకటేష్ లకు ఇదే తొలి వెబ్ సిరీస్. దీంతో వీరిద్దరు ఫస్ట్ టైమ్ డిజిటల్ వరల్డ్ లోకి ఎంట్రీ ఇస్తున్నారు. బాబాయ్ అబ్బాయ్ పోటా పోటీగా నటించిన ఈ వెబ్ డ్రామాలో ఇద్దరి మధ్య సాగే వైరం ప్రధాన హైలైట్ గా నిలవబోతోంది. అంతే కాకుండా చాలా రూడ్ క్యారెక్టర్ లో రానా పాత్రని డిజైన్ చేసిన తీరు కూడా ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకోనుంది. ఇటీవల ముంబైలో జరిగిన ప్రత్యేక ఈవెంట్ లో ఈ సిరీస్ ట్రైలర్ ని విడుదల చేశారు. ఇప్పటికే ప్రచార చిత్రాలతో హల్ చల్ మొదలు పెట్టిన బాబాయ్ అబ్బాయ్ ఈ సిరీస్ తో ఓటీటీ వరల్డ్ లో గట్టి ఇంపాక్ట్ ని కలిగించడం ఖాయం అనే కామెంట్ లు వినిపిస్తున్నాయి. తండ్రి కొడుకులుగా వెంకటేష్ రానా నటించారు. అయితే ఇద్దరి మధ్య వైరం ఎందుకు మొందలైంది.. నారా నాయుడుకు నాగా నాయుడు కున్న పగ వెనకున్న అలసు కథేంటి? అన్నదే ఇందులో ఆసక్తికరం. అయితే విక్టరీ వెంకటేష్ కున్న ఫ్యామిలీ హీరో ఇమేజ్ ని మాత్రం ఈ సిరీస్ డ్యామేజ్ చేసేలా వుందని అభిమానులు వాపోతున్నారు. రానాని వుద్దేశించి వెంకటేష్ పలికిన సంభాషణలు ఇద్దరి నేపథ్యంలో వచ్చే క్రూషియల్ సీన్స్ వెంకీ కాలర్ ని రానా పట్టుకుని పాయింట్ బ్లాంక్ లో గన్ పెట్టి బెదిరిస్తున్న సన్నివేశాలు ఫ్యామిలీ ప్రేక్షకుల్ని వెంకీకి దూరం చేసేలా వున్నాయనే కామెంట్ లు వినిపిస్తున్నాయి. మార్చి 10 నుంచి హిందీ తెలుగు భాషల్లో నెట్ ఫ్లిక్స్ లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ స్టార్ట్ కాబోతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ ని షేర్ చేస్తూ రానా వెంకటేష్ ఆసక్తికరమైన పోస్ట్ ని షేర్ చేశారు. తండ్రీ కొడుకులు బద్ధ శత్రువులుగా మారితే ఏం జరుగుతుంది? .. మార్చి 10న నెట్ ఫ్లిక్స్ లో చూడిండి' అంటూ పోస్ట్ పెట్టారు. 'రానా బాప్ నుంచి ఆప్ ని తీసేస్తాడు... మార్చి 10న నేనూ నాగా ముఖాముఖిని మార్చి 10న నెట్ ఫ్లిక్స్ లో చూడండి' అంటూ రానా షేర్ చేశాడు. ఇదే సందర్భంగా వెంకటేష్ జైలు నుంచి విడుదలైన వీడియోని షేర్ చేశాడు. ప్రస్తుతం ఇది నెట్టింట ట్రెండవుతోంది.

## ఉగ్రం' టీజర్ లో ఆ డైలాగ్ పెట్టడం పై రైటర్ ఏమన్నారంటే ?




అల్లరి నరేష్ తొలిసారిగా తన కెరీర్ లో పవర్ఫుల్ పోలీస్ అధికారిగా కనిపించనున్న యాక్షన్ థ్రిల్లింగ్ మూవీ ఉగ్రం. ఇటీవల అల్లరి నరేష్ తో నాంది వంటి యాక్షన్ ఎమోషనల్ మూవీ తీసిన విజయ్ కనకమేడల మరోసారి ఈ మూవీకి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. మొదటి నుండి అందరిలో ఈ క్రేజీ కాంబో మూవీ పై మంచి అంచనాలు ఉన్నాయి. మిర్నా హీరోయిన్ గా టాలీవుడ్ కి పరిచయం అవుతున్న ఈ మూవీని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఎంతో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ అందిస్తున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ టీజర్ ని నేడు స్పెషల్ ఈవెంట్ లో భాగంగా అక్కినేని నాగచైతన్య విడుదల చేసారు. భారీ యాక్షన్, ఎమోషనల్ హంగులతో ఆకట్టుకున్న ఉగ్రం టీజర్ చివర్లో ఒక బూతు పదం ఉండడంతో పలువురు ఆడియన్స్, ఫ్యాన్స్ ఒకింత షాక్ కి గురయ్యారు. అయితే దానిపై ఉగ్రం మూవీ రైటర్ అబ్బూరి రవి మాట్లాడుతూ, నిజానికి సినిమాలో ఎంతో బాధలో హీరో పలికే ఆ డైలాగ్ బూతు కాదని, అతడికి జరిగిన అన్యాయం తాలూకు ఆవేదన తెలుపుతూ అది పెట్టడం జరిగిందని అన్నారు. అంతేతప్ప ఆ బూతు మాట ఆ సీన్ లో పెట్టాలి అనేది తమ ఉద్దేశ్యం కాదని అన్నారు. కాగా ఈ మూవీ సమ్మర్ లో ఆడియన్స్ ముందుకి రానుంది.

# 'పఠాన్' రికార్డ్ బద్దలు కొట్టేది ఆ ఇద్దరేనా?







షారుక్ ఖాన్ దాదాపు నాలుగేళ్ల విరామం తరువాత నటించిన మూవీ పఠాన్. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో యష్ రాజ్ ఫిలింస్ బ్యానర్ పై ఆదిత్య చోప్రా అత్యంత భారీ స్థాయిలో ఈ స్పై యాక్షన్ డ్రామాని నిర్మించారు. యష్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్ లో భాగంగా తెరకెక్కిన పఠాన్ కు ముందు నుంచీ ఎదురు దెబ్బలే తగిలాయి. టైటిల్ అనౌన్స్ మెంట్ వీడియో నుంచి ఈ మైఊవీపై బాయ్ కాట్ గ్యాంగ్ సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే. ఆ తరువాత దీపికా పదుకునే షారుక్ లపై చిత్రీకరించిన బేషరమ్ రంగ్ సాంగ్ లో దీపిక కాషాయం రంగు బికినీ ధరించి కనిపించడం టూ మచ్ ఎక్స్ పోజింగ్ చేయడంతో మరో వివాదం చుట్టుముట్టింది. పఠాన్ని భారత్ లో నిషేధించాలని ఓ వర్గం డిమాండ్ చేయగా సాధువులు చాలా వరకు పఠాన్ మూవీతో పాటు షారుక్ ఖాన్ పై మండిపడ్డారు. సినిమాని బాయ్ కాట్ చేయాలంటూ నెట్టింట వైరల్ గా ప్రచారం చేశారు. అయితే అవన్నింటినీ తట్టుకుని కంటెంట్ బలంగా వుండటంతో వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద పఠాన్ వండర్స్ క్రియేట్ చేసింది. దేశ వ్యాప్తంగా ఊహించని విధంగా రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి సంచలనం సృష్టించింది. ఏకంగా హిందీ వెర్షన్ లో 500 కోట్లు రాబట్టిన పఠాన్ మిగతా భాషల్లో కలిపి ప్రపంచ వ్యాప్తంగా 1000 కోట్ల మార్కుని దాటింది. ఈ నేపథ్యంలో పఠాన్ రికార్డుని కొట్టేది ఎవరు అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ రేసులో ప్రధానంగా టాలీవుడ్ టాప్ స్టార్స్ ప్రభాస్ అల్లు అర్జున్ ల పేర్లు వినిపిస్తున్నాయి. ప్రభాస్ నటిస్తున్న మూడు క్రేజీ సినిమాలు ఆది పురుష్ సలార్ ప్రాజెక్ట్ కె అయితే సలార్‌తో ప్రభాస్ వెయ్యి కోట్ల మార్కుని టచ్ చేయడం గ్యారెంటీ అనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఆది పురుష్ విషయంలో ఫ్యాన్స్ ముందు నుంచి భయపడుతున్న నేపథ్యంలో అందరి దృష్టి సలార్‌పైనే వుంది. ఇక ప్రభాస్ తరువాత బన్నీ కూడా ఈ రేసులో నిలుస్తాడని ఇన్ సైడ్ టాక్. బన్నీ ప్రస్తుతం పుష్ప 2లో నటిస్తున్నాడు. దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పుష్పతో సాధించలేని వసూళ్లని పుష్ప 2తో దక్కించుకోవాలని ప్లాన్ చేసుకుంటున్నాడట. ఈ ఇద్దరి తరువాత సల్మాన్ ఖాన్ కూడా ఈ జాబితాలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. సల్మాన్ ఖాన్ త్వరలో కిసీ క భాయ్ కిసీకి జాన్‌తో రాబోతున్నా కానీ టైగర్ 3తో మాత్రమే ఈ ఫీట్ ని సాధించి వెయ్యి కోట్ల మార్కుని చేరుకుంటాడని బాలీవుడ్ ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

# పవన్ రెండవసారి దేవుడి అవతారం!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్..సాయి ధరమ్ హీరోలాగా తమిళ్ సినిమా 'వినోదయ సిద్ధమ్' తెలుగులో రీమేక్ అవుతోన్న సంగతి తెలిసిందే. నిన్నటి రోజున సినిమా లాంచింగ్ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో పీకే సహా ప్రాజెక్ట్ లో కీలక నటులంతా పాల్గొన్నారు. ఇందులో పీకే దేవుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో పవన్ పాత్ర నిడివి తక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్ని కీలకమైన సన్నివేశాల్లో అలా వచ్చి వెళ్లిపోయే అవకాశం ఉంది. ఈ సినిమా చేయడం కూడా మేనల్లుడి కోసమే చేస్తున్నట్లు ఓవైపు ప్రచారం సాగుతోంది. అవన్నీ పక్కన బెడితే పవన్ దేవుడి పాత్ర పోషించ దం మాత్రం ఇది రెండవ సారి ఇంతకు ముందు 'గోపాల గోపాల' సినిమాలో శ్రీకృష్ణుడి పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. హీరోగా విక్టరీ వెంకటేష్ నటించిన చిత్రమిది. బాలీవుడ్ సినిమా 'ఓ మైగాడ్' కి రీమేక్ రూపం. అయితే ఆసినిమాలో దేవుడి పాత్ర మరీ అంత గొప్పగా పండింది కాదు. పవన్ ఇమేజ్ ని ఎన్ క్యాష్ చేసుకునే ప్రయత్నం తప్ప పాత్రలో పస లేదు. ఆ సినిమా కూడా యావరేజ్ గా ఆడింది. ఆ రకంగా కృష్ణుడి పాత్రతో పవన్ మార్క్ అయితే పెద్దగా కనిపించలేదు. తాజాగా మరోసారి వినోదయ్య సిద్ధమ్ లో అలాంటి ప్రయత్నమే చేస్తున్నాడా? లేక దేవుడి పాత్రనే ఓ వండర్ గా మలుస్తున్నారా? అన్నది చూడాలి. ఇప్పటివరకూ ఈ సినిమాలో సాయితేజ్ని హైలైట్ చేసే ప్రయత్నం కనిపించింది తప్ప! పవన్ మాస్ ఇమేజ్ ని సినిమా పరంగా జనాల్లోకి ఇంకా అంతగా బలంగా తీసుకెళ్లలే దు. అయితే ఈ సినిమాకి కర్త.. కర్మ..క్రియలా దర్శకుడు త్రివిక్రమ్ వ్యవహరిస్తున్నాడు. కాబట్టి పవన్ పాత్రని బలంగా మార్చడానికి అవకాశం ఉంది. 'గోపాల గోపాల' కి వేర్వేరు రచయి తలు పనిచేయడం తో మాతృకని పెద్దగా మార్చలేదు. అలాగే పవన్ పాత్రని వారంతా సీరియస్ గా తీసుకున్నట్లు కనిపించలేదు. మరి ఈసారి పీకే పాత్ర ఎలా ఉంటుందన్నది చూడాలి. పవన్ ని అభిమానులు దేవుడిగా ఆరాదిస్తుంటారు. మా దేవుడు మా దేవుడు అంటూ ఎప్పటికప్పుడు రచ్చ చేస్తుంటారు. మరి వాళ్ల అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని గురూజీ నిజంగానే దేవుడి అంతటి వాడ్ని చేసేస్తాడా? అన్నది చూడాలి.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB — SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :

| | | | |
|---|---|---|---|
| Hyderabad | 76600 27682, 7842106355 | Tirupathi | 94400 77239 |
| Visakhapatnam | 0891-2791205, 9246663046 | Bapatla | 94403 20562 |
| | 7660027696, 7660027664 | Ponnur | 99089 91763 |
| Vijayawada | 76600 27670, 900062111 | Cherukupalli | 79958 56068 |
| | | Karlapalem | 76600 27676 |

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989